

జిల్లాలోని ఇసుక క్వారీలన్నింటిని తనిఖీచేసి రిపోర్టు ఇవ్వాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ జారీచేసిన ఆదేశాలు ఇక్కడి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేస్తున్నాయి. భారీ యంత్రాలతో జిల్లాలో కృష్ణానది తీరం వెంట నిత్యం ఇసుక తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నారు. దీనిపై శాటిలైట్ ఇమేజ్‌లన్నీ కేంద్ర నిఘాసంస్థల వద్ద నిక్షిప్తమై ఉన్నట్లు ఇప్పటికే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించినా ఉలుకుపలుకు లేదు. తాజాగా ఎన్‌జీటీ ఇసుక రీచ్‌లన్నింటిని తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్‌ని ఆదేశించడంతో అధికారులు హడలిపోతున్నారు. ఎన్‌జీటీ వద్ద సమగ్ర సమాచారం ఉన్న నేపథ్యంలో అక్రమాలను దాచిపెట్టి అంతా సవ్యంగా ఉన్నట్లు రిపోర్టు అస్తే అది సంబంధిత అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం లేకపోలేదు.


బాపట్ల : జువ్వలపాలెం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా


అమరావతి: మల్లాదిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఇసుక మస్కా

- ఎన్జీటీ ఆదేశాలతో ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్‌లు
- కృష్ణా తీరంలో గుంటూరు, బాపట్ల కలెక్టర్‌ల తనిఖీలు
- అమరావతి ప్రాంతంలో పల్నాడు కలెక్టర్.. ● మున్నంగి రీచ్‌కి వచ్చిన వారిని బయటకు పంపేసిన అధికారులు
- మీడియాను తిప్పిపంపిన అధికారులు ● కొన్నిచోట్ల కలెక్టర్‌లను తప్పుదారి పట్టించిన కిందిస్థాయి సిబ్బంది
- తవ్వకాలు జరిపేది ఒకచోటయితే చూపించింది మరోచోట
- అక్రమార్కులకు ముందే సమాచారం ఎవరిచ్చినట్లో!
- తవ్వకాలు ఆపేసి... యంత్రాలను తప్పించేసి...
- ఇన్నాళ్లు కళ్లకు గంతలు కట్టుకొన్న జిల్లా స్థాయి అధికారులు

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి14 (ఆంధ్ర జ్యోతి): ఎన్జీటీ ఆదేశాలతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండు జిల్లాల కలెక్టర్‌లు, ఇతర శాఖల అధికారుల బృందం కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లలో తనిఖీలు నిర్వహించింది. బాపట్ల జిల్లా జువ్వలపాలెం, గుంటూరు జిల్లా మున్నంగి, మరికొన్ని రీచ్‌లలో కలెక్టర్ల బృందం ఇసుక తవ్వకాల తీరును పరిశీలించింది. అయితే తనిఖీల సమయంలో స్థానికును అనుమతించ లేదు. బాపట్ల జిల్లా కలెక్టర్ జువ్వలపాలెం రీచ్ పరిశీలించే సమయంలో స్థానికులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. స్థానికులను అక్కడికి రానివ్వకుండా కిందిస్థాయి అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే గుంటూరు జిల్లా అధికారుల బృందం మాత్రం మున్నంగిలో పరిశీలించే సమయంలో అధికారులు మినహా ఇతరులు ఎవరూ ఉండొద్దని ముందే చెప్పేయటంతో స్థానికులు దగ్గరకు వెళ్లలేదు. చివరకు మీడియాను కూడా తర్వాత పిలుస్తామని సున్నితంగా వెనక్కు పంపేశారు. అయితే కొన్నిచోట్ల స్థానికులు దూరం నుంచి తవ్వకాలు జరుగుతోంది ఇక్కడ కాదు... మరోచోటని అధికారుల బృందానికి చెప్పేందుకు ప్రయత్నించినా వారి కేకలు పట్టించుకోలేదు. తవ్వకాలు జరుగుతున్నది ఒకచోటైతే, తనిఖీలు చేసింది మాత్రం మరోచోట. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అన్ని రీచ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిఉంటే, కిందిస్థాయి సిబ్బంది, మైనింగ్ శాఖలో కొందరు ఏకంగా జిల్లా కలెక్టర్‌లనే తప్పుదారి పట్టించారు. రెండు రోజుల ముందు ఆపేసిన రీచ్‌ను ఒకచోట, జె.పి సంస్థ తవ్వకాలు ఆపేసిన తర్వాత ఆగిన మరోచోట చూపించటం, కింద నీరు ఉండటంతో ఒడ్డునుంచే పరిశీలించాల్సి వచ్చింది. పల్నాడు జిల్లాలో కలెక్టర్ తనిఖీలకు వచ్చినప్పుడు కొంతవరకు తవ్వకం దారులు, అధికారులు భయపడినట్టు కనిపిస్తే, గుం టూరు, బాపట్ల జిల్లాలో కిందిస్థాయి అధికారులే వాస్తవాలు చూపించకుండా తప్పుదారి పట్టించారని రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అధికారులు ఇటువైపు ఎన్ని అక్రమాలు జరిగినా కన్నెత్తయినా చూడలేదని, ఇప్పుడు జిల్లా కలెక్టరే రావటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అయితే తనిఖీలకు ముందే తవ్వకాలు ఆపేసి ఉండటం, అక్కడ ఏమీ జరగటంలేదన్నట్టు చూ పించటానికి మిగిలిన శాఖల అధికారులు ప్రయత్నం చేశారు. అయినా గుంటూరు కలెక్టర్ మాత్రం లోపలకు వెళ్లిమరీ పరిశీలించారు. అయితే నిన్నటివరకు తవ్విన ప్రాంతం కాకుండా, కొత్తగా తవ్వటానికి వేసిన గాలుమార్గంలో చూపించటంతో స్థానికులు నిరాశకు గురయ్యారు.

పాత్రికేయునిపై దాడి

కొల్లూరు, అమరావతి, కొల్లిపర, ఫిబ్రవరి14: కొల్లూరు మండలం జువ్వలపాలెం వద్ద కృష్ణానది ఇసుక రీచ్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతల్లంకకు చెందిన తోడేటి సురేష్ పెదలంక గ్రామ పరిధిలోని అరవింద వారధి సమీపంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమ తవ్వకాలపై స్పందనలో అర్జీ అందించామని, ఆ కాపీలను నదీ పరీవాహక శాఖతో పాటు మైనింగ్ శాఖ ఏడీకి కూడా పంపినట్లు కలెక్టర్‌కు తెలిపారు. స్పం దించిన కలెక్టర్ ఇసుక తవ్వకాలు పరిశీలించి విచారణ చేసి తనకు నివేదిక అందించాలని సూచించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు రీచ్‌లను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పరిశీలించారు. కలెక్టర్ వెళ్లిపోయిన 15గంటల్లో మరలా ఇసుక అక్రమ క్వారీయింగ్ ప్రారంభించారు. వైసీపీ వర్గీయులు బుధవారం ఉదయం నుంచి వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో క్వారీయింగ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను కవర్ చేసేందుకు వెళ్లిన ఓ పాత్రికేయునిపై వైసీపీ నాయకుని అనుచరులు దాడిచేసి అతని వద్దనున్న సెల్‌ఫోన్ తీసుకుని భయానక వాతావరణాన్ని సృష్టించారు. మల్లాది రీచ్‌లోకి వెళ్లిన తనను గ్రామానికి చెందిన వెంపా శ్రీను, తులసి తిరుపతిరావుతో పాటు మరికొందరు తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత్రికేయుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం మండలంలోని బొమ్మువానిపాలెం, వల్లభాపురం ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు.

అక్రమాలు బహిరంగం..

కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ఇసుక తవ్వకాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. ఒక్కో రీచ్‌లో నిబంధనలతో పనిలేకుం డా ఏడు నుంచి 15 అడుగుల లోతు లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నా రు. నిబంధనలను ఎంత దారుణంగా అతిక్రమిస్తున్నారనే దానికి దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు దగ్గర అక్రమ తవ్వకాలపై అధికార పార్టీ నేతలే ఫిర్యాదు చేయటం నిదర్శనం. ఇదేతరహాలో కొల్లిపర మండలంలోని రీచ్‌లపైనా పలు ఫిర్యాదులు అందా యి. అయితే అక్రమ తవ్వకాలు జరుపుతున్న రీచ్‌లను వదిలేసి, రెండురోజుల క్రితం తవ్వకాలు ఆపేసిన మున్నంగి రీచ్‌ను సిబ్బంది చూపించటం కూడా స్థానికుల విమర్శకు తావిస్తోంది. అయితే అక్రమ తవ్వకాలను పట్టుకునే ఆలోచనతో గుంటూరు జిల్లా కలెక్టర్ నది లోపలకి వెళ్లిమరీ పరిశీలించారు. కానీ కిందిస్థాయి సిబ్బంది మాత్రం నిన్నటి వరకు తవ్వకాలు జరిపిన చోటకు వేసిన పాత గాలు మార్గం నుంచి కాకుండా, ఇటీవల మరోచోట తవ్వేందుకు కొత్తగా వేసిన గాలులోకి తీసుకెళ్లారనేది విమర్శ. ఈ గాలులో లారీ వెళ్లటమే కానీ, తిరిగి రావటానికి వీలుగా వేయలేదు. పనులు పూర్తికాకపోవటంతో అసంపూర్తిగానే ఉంది. ఈ రీచ్‌లో రెండు రోజులకోసారి దొంగ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అయితే లారీ వెనక్కు నడిపించుకు వెళ్లి మరీ ఇసుక పోసుకొస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు స్థానికులు ప్రయత్నించినా వారిని ఆయన దగ్గరి వరకు వెళ్లనివ్వకుండానే సిబ్బంది అడ్డుకున్నారు. అప్పటికీ స్థానికుడు ఒకరు తన ఫోన్‌లో ఈ తనిఖీల వ్యవహారాన్ని, కిందిస్థాయి సిబ్బంది అత్యుత్సాహాన్ని వీడియో తీస్తుంటే, అతనిని పట్టుకుని మైనింగ్ శాఖలో ఓ అధికారి ఫోన్ తీసుకుని, ఆ వీడియోలను మొత్తం డిలీట్ చేయించి మరీ బయటకు పంపటం విశేషం. కొత్తబొమ్మువానిపాలెంలో బుసక పేరుచెప్పి ఇసుకతరలించేస్తున్నా, వల్లభాపురం దగ్గర అనుమతి తీసుకుని, మున్నంగి దగ్గర ఇసుక తవ్వుతున్నా, మున్నంగి, అత్తలూరివారాపాలెం, కొల్లిపర దగ్గర భారీగా ఇసుక కొండలను పోలిన గుట్టలు పోసి ఉంచినా వాటిపై ఆరా కూడా తియ్యకుండా, భారీ ఇసుక లోడుతో నీరు కారిపోతూ లారీలు కనిపించినా వాటినీ ఆపకుండా తనిఖీలు మాత్రం చేశామనిపించటానికి కిందిస్థాయి సిబ్బంది తాపత్రయపడ్డారు. వాస్తవానికి మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిన చోట అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా లొకేషన్ ప్రాకారం చూస్తే గుట్టు బయటపడేది. జిల్లా కలెక్టర్ రాకముందే అధికారుల బృందం అన్నీ ముందస్తుగా పరిశీలించి చూడాల్సిన ప్రదేశాలను నిర్ణయించటం విశేషం. మరి గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఏమి నివేదిక అందుతుందో! అక్రమార్కులపై చర్యలు ఎంతవరకు ఉంటాయో!



వైకుంఠపురం ఇసుక రవాణాకు ఇస్తున్న వే బిల్లులు


కొల్లిపర: బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌లో కలెక్టర్ తనిఖీల అనంతరం యథాతథంగా కొనసాగుతున్న ఇసుక లోడింగ్

అంతా రహస్యమే.. ఎవరికోసం!

ఇసుక రీచ్‌లలో అక్రమాలు జరుగుతున్నాయని, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందంటూ పదేపదే ఎన్జీటీని స్థానికులు ఆశ్రయిస్తుండటం, ఎన్జీటీ ఆదేశాలు జారీచేసి అధికారులను అమలు జరపమని చెప్పటం ప్రతిసారీ జరగుతూనే ఉన్నాయి. అయితే ఈసారి ఎన్జీటీ మరో అడుగు ముందుకువేసి ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయా జిల్లాల పాలనాధికారులను ఆదేశించింది. దీంతో కలెక్టర్‌లు రీచ్‌ల తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే పల్నాడు కలెక్టర్ రీచ్‌లను పరిశీస్తే, బుధవారం గుంటూరు, బా పట్ల కలెక్టర్లు ప్రకాశం బ్యారేజికి దిగువునున్న కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. బాపట్ల కలెక్టర్ కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అయితే అక్కడ తవ్వకాలు చాలాకాలం క్రితం ఆపేశారు. ప్రస్తుతంగాజుల్లంక, పెదలంక దగ్గర ఇసుక, చిలుమూరులో బుసక తవ్వకాల పేరుతో నిత్యం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి కూడా రెండ్రోజులుగా ఆపారు. జువ్వలపాలెం రీచ్‌ను ఒడ్డునుంచే చూడాల్సి వచ్చింది. ఎందుకంటే నది ఒడ్డువెంట నీటిపాయ ప్రవహిస్తోంది. అటువంటిచోట తవ్వకాలుఎట్లా జరుపుతారనే ఆలోచన కూడా చేయకుండా సిబ్బంది కలెక్టర్‌ల బృందాన్ని తప్పుదారి పట్టించారని ఆరోపిస్తున్నారు. కొల్లూరు మండలం పెదలంక దగ్గర ఇసుక అనుమతి లేకుండా తవ్వుతున్నారని, మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, దయచేసి మీరైనా పెదలంక వచ్చి పరిశీలించాలని రైతు సంఘం నాయకుడు సురేష్ కలెక్టర్‌ను అభ్యర్థించారు.

రాజధానిలో ఇష్టారాజ్యం..

తుళ్లూరు మండ లంలోని పలు ఇసుక రీచ్‌లు ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్ పరిధిలో ఉన్నాయి. దీని దృష్ట్యా అక్కడ ఇసుక తవ్వకాలను గతంలోనే ఎన్‌జీటీ నిషేధించింది. అయినప్పటికీ అధికార వైసీపీ నేతలు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల అండదండలతో చెలరేగిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అందినకాడికి వెనకేసుకొంటున్నారు. ఇసుక రీచ్‌లను కొంతమంది నేతలకు అప్పగించి వారి ద్వారా తాడేపల్లి ఆఫీసుకు పెద్దమొత్తంలో నగదు చేరేలా ఒక వ్యవస్థని రూపొందించుకొన్నారని గత కొన్ని నెలలుగా ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తాడేపల్లిలో ఇసుక రీచ్‌లు అయితే కృష్ణా జిల్లా వైసీపీకి చెందిన ఒక యువ నాయకుడికి కేటాయించారు. అలానే దుగ్గిరాల, కొల్లిపరలోనూ అధికార వైసీపీ నేతలదే పెత్తనమంతా. గతంలో మైనింగ్, పోలీసు, రవాణ శాఖ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించి ఇసుక లారీలు, యంత్రాలను సీజ్ చేసేవారు. గత కొన్ని నెలల నుంచి ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడి మైనింగ్ శాఖకు సంబంధం లేకుండా అంతా విజయవాడ రాష్ట్ర కార్యాలయం కనుసన్నల్లోనే ఇసుక రీచ్‌ల కాంట్రాక్టుల వ్యవహారం నడుస్తోంది. గత వారం జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు. త్వరలోనే ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు వచ్చే అవకాశం ఉందని, అధికారులు పీకల్లోతు కూరుకుపోయారు, ఇకపై తప్పు చేయొద్దని హితవు పలికారు. అయితే అధికారులు పెడచెవిన పెట్టారు. ఇప్పుడు ఎన్‌జీటీ నుంచి ఆదేశాలు రావడంతో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్
- ఎమ్మెల్యే సాంబశివరావు
- 17న చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో నమ్మకం కోల్పోయారని అన్నారు. ఇంకొల్లులో ఈనెల 17న జరిగే రా కదిలిరా సభకు బాపట్ల పార్లమెంట్‌లోని ప్రతి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు తరలివచ్చి ఇంకొల్లు సభ చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఇంకొల్లులో తారకరామా విజయభేరి ప్రాంగణంలో పార్టీ ప్రముఖ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో టీడీపీ భారీ విజయం సాధించాలనే ధ్యేయంతో ఈ ప్రాంగణానికి తారకరామ విజయభేరిగా నామకరణం చేశామన్నారు. నేమ్ బోర్డుల్లో మాత్రమే నమ్మకం ఉంది తప్పా జగన్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని చెప్పారు. గత ఎన్నికల్లో జగన్‌పై నమ్మకంతో 151 సీట్లు గెలిపిస్తే, ఈ నాలుగు సంవత్సరాలు అధికార అహంతో అరాచక పాలన సాగించారని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు తప్పు తెలుసుకొని ఆ పార్టీని వీడతున్నారన్నారు. లక్ష మంది సభకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 17వ తేదిన మధ్యాహ్నం 1.30కు సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకుంటారని ఏలూరి తెలిపారు. 4 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో సమావేశాలు వేసుకొని అధిక సంఖ్యలో సభకు తరలివచ్చేలా నాయకులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు రా కదిలిరా సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. భూమి పూజలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్రవర్మ, ఎం.అమరరావు, పిల్లి మాణిక్యరావు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పర్చూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సభ నిర్వహణ ఏర్పాట్లు

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: ఇంకొల్లులో ఈనెల 17న జరగనున్న రా కదిలిరా సభ నిర్వాహణ పనులు శరవేగవంతంగా జరుగుతున్నాయి. ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లు తొలగిస్తున్నారు. సుమారు 20 ఎకరాల్లో సభ జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని చీరాల డీఎస్పీ ప్రసాదరావు, ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు.


ప్రాంగణంలో మాట్లాడుతున్న ఏలూరి

సీట్ల.. డైలమా!

- సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి, ఆమంచి
- రేపల్లె సీటు విషయంలో తర్జనభర్జన

బాపట్ల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పాలకపార్టీలో సీట్ల తకరారు నడుస్తూనే ఉంది. సీఎంవో నుంచి జిల్లా నేతలకు పిలుపుల పర్వం కొనసాగుతూనే ఉంది. బుధవారం ఎంపీ మోపిదేవితో పాటు పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ లు తాడేపల్లి పెద్దలతో సమావేశమైనట్లు సమాచారం. రేపల్లె సీటు తనకే కేటాయించాలని ఎంపీ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ చేపట్టిన ఇన్‌చార్జి మార్పుల్లో భాగంగా రేపల్లెకు డాక్టర్ ఈవూరు గణేష్‌ను సమన్వయకర్తగా అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తీసుకుని ఇప్పటికే మూడునెలల గడిచింది. అయినప్పటికీ ఇంకా ఆ సీటుకు సంబంధించి పంచాయితీ నడుస్తూనే ఉంది. గణేష్ విష యంలో వైసీపీ పెద్దలు పున రాలోచనలో పడ్డారనే ప్రచారం గత కొన్ని రోజులుగా జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అధిష్ఠానంతో సమావేశ మవడం చర్చనీయాంశమయింది.

ఆమంచి కృష్ణమోహన్ సైతం..

పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా యడం బాలాజీకి వైసీపీ అవకాశం ఇవ్వనుందనే ప్రచారం నేపథ్యంలో ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న కృష్ణమోహన్ సైతం తాడేపల్లి పెద్దలతో బుధవారం సమావేశమయ్యారని తెలుస్తోంది. ఇన్‌చార్జిల విషయంలో మరింత స్ప ష్టత ఇచ్చే క్రమంలోనే వీరిద్దరితో పార్టీ పెద్దలు చర్చలు జరిపారని స మాచారం.

ఖాకీలకు.. మరకలు!

- కోర్టు అక్షింతలేస్తున్నా ఏకపక్ష సేవలేనా!
- విమర్శలకు తావిస్తున్న జిల్లా పోలీసుల వైఖరి
- 41ఏ నిబంధనలను కోర్టు గుర్తు చేయాలా..!
- నిష్పక్షపాత వైఖరి ఎందుకు తీసుకోలేకపోతున్నారు..



బాపట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సెక్షన్లు.... అరెస్టులు.. విచారణలు ఇలాంటి ప్రక్రియ అంతా పోలీసులకు కొట్టిన పిండి. ఎక్కడ ఏ నిబంధనలు పాటించాలో కూడా వారికి క్షుణ్ణంగా తెలుసు. కాకపోతే వాటిని అమలు చేయడంలోనే అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మార్టూరులో జరిగిన గ్రానైట్ ఫ్యాక్టరీల సోదాల వ్యవహారంలో నమోదు చేసిన కేసుల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారన్న అపవాదును మూటగట్టుకున్నారు. దీనిని బలపరిచే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో హైకోర్టు 41ఏ నిబంధనలు పాటించడంపై కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ప్రక్రియ పాటించని పోలీసులను జైలుకు పంపించేలా ఆదేశాలిస్తామనే తీవ్ర వ్యాఖ్యలు సైతం పిటిషన్ విచారణ సమయంలో కోర్టు చేసిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

☛ మొత్తం 8 మందిపై కేసు..

గడచిన నెల 30న మార్టూరులోని గ్రానైట్ ఫ్యాక్టరీల సోదాలకు సంబంధించి తలెత్తిన వివాదంలో పోలీసులు ఏకపక్షంగా 8 మందిపై కేసు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఫ్యాక్టరీ యజమానులు ఇచ్చిన ఫిర్యాదును బుట్టదాఖలు చేయడమే కాకుండా వారిని రాత్రికి రాత్రే అరెస్టు చేసిన తీరు ఖాకీల ఏకపక్ష వైఖరికి నిదర్శనంగా కనబడిందని ప్రజలు అంటున్నారు.

☛ ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టు గడపతొక్కగా..

పోలీసులు కేసు నమోదు చేసిన 8 మందిలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా ఉండడంతో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టులో వేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ విచారణలో భాగంగా హైకోర్టు పోలీసుల వైఖరిని తప్పు బట్టింది. ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసుల్లో సెక్షన్ 41ఏ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాల్సి ఉండగా నేరుగా అరెస్టుల పర్వానికి ఎందుకు వెళుతున్నారని కొం చెం ఘాటుగానే వ్యాఖ్యానించింది. దీంతో ఎమ్మెల్యే ఏలూరికి మార్టూరు పోలీసులు మంగళవారం 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరారు.

☛ కోర్టు చెప్పాల్సిందేనా...

సహజంగా చట్టప్రకారం జరగాల్సిన ప్రక్రియ లో కూడా కోర్టు ఆదేశాలిచ్చాకే జిల్లా పోలీసులకు నిబంధనలు గుర్తుకు రావడం విచారకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే కేసుల్లో గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులను ఆగమేఘాల మీద అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపర్చిన తీరు ఎవరి మెప్పుకోసమనే చర్చ నడుస్తోంది. హైకోర్టు వ్యాఖ్యల ప్రకారం చూస్తే వారికి కూడా 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని తర్వాతే అరెస్టుపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుందని తేటతెల్లమైంది. కానీ రూల్ ఆఫ్ లాను పక్కనబెట్టి ఖాకీలు వ్యవహరించిన తీరు సదరు విభాగానికి శోభనివ్వదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ప్రజలు హితవు చెబుతున్నారు.

చాలా అంశాల్లో ఇదే తీరున..

మార్టూరు ఘటనే కాదు చాలా అంశాల్లో పోలీసుల ఏకపక్ష తీరు విస్మయానికి గురిచేస్తోంది. నిరసనలు, ధర్నాలు లాంటి ప్రజాస్వామ్య హక్కులను కూడా ఇటీవల కాలంలో పోలీసులు కాలరాస్తున్నారు. గడచిన ఆరునెలల వ్యవధిలో దాదాపు వెయ్యి మందికిపైనే నిరసన, ధర్నాలు లాంటి కారణాలతో కేసులు నమోదు చేయడం గమనార్హం. దాదాపు అన్ని కేసుల్లో కూడా బాధితులు ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తప్పుబట్టి రోడ్డుమీదకు వచ్చిన వారే కావడం ఖాకీల దమనీతికి అద్దం పడుతోంది.

☛ ఎన్నికల టైంలో కూడా ఇలానే ఉంటే..

ఈ నాలుగున్నరేళ్ల వ్యవధిలో ఏవో ఒకటి రెండు సందర్భాల్లో మినహాయిస్తే పాలకపార్టీ సేవలో పోలీసులు తరించారన్నది కాదనలేని వాస్తవం. సమీప దూరంలో ఎన్నికలు జరగనుండడంతో ఖాకీల తీరు ఇలానే ఉంటే అధికారపార్టీకి కొమ్ముకాసే అరాచకశక్తులు రెచ్చిపోయే ప్రమాదముందనే భయాన్ని విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోగలరా అనే అనుమానాలు సైతం ముసురుకుంటున్నాయి. ప్రతిసారీ కోర్టులు జోక్యం చేసుకుని బాధితులకు అండగా ఉండడం కుదరకపోవచ్చని పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం ఒక్కటే మార్గం అనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.


ఎమ్మెల్యే ఏలూరికి మంగళవారం 41ఏ నోటీసులు అందిస్తున్న పోలీసులు

రాజ్యాంగ పరిషత్

దిక్సూచి DIKSUCHI

స్వాతంత్ర్యానంతరం మౌంట్ బాటన్ 1948 జూన్ 21 వరకు గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. తరవాత సి.రాజగోపాలచారి 1950 జనవరి 24 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. పాకిస్థాన్‌కు మహమ్మదాలి జిన్నాను గవర్నర్ జనరల్‌గా నియమించారు.

నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం: స్వాతంత్ర్యానంతరం నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంతో మౌంట్ బాటన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

1. జవహర్‌లాల్ నెహ్రూ - ప్రధాని, విదేశీ వ్యవహారాలు
2. సర్దార్ వల్లభభాయ్ పటేల్ - ఉప ప్రధాని, హోంశాఖ
3. బాబూ రాజేంద్రప్రసాద్ - వ్యవసాయం, ఆహారం
4. మౌలానా అబుల్ కలామ్ అజాద్ - విద్యాశాఖ
5. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - న్యాయశాఖ
6. సర్దార్ బలదేవ్‌సింగ్ - రక్షణశాఖ
7. షణ్ముగం శెట్టి - ఆర్థికశాఖ
8. జాన్ ముత్తాయ్ - రైల్వేలు, ఉపరితల రవాణా
9. బాబూ జగజ్జీవన్‌రామ్ - కార్మికశాఖ
10. రఫి అహ్మద్ కిద్వాయ్ - కమ్యూనికేషన్లు, పౌర విమానయానం
11. సిహెచ్.బాబా - వాణిజ్యం
12. ఎన్.వి.గాడ్గిల్ - గనులు, విద్యుత్
13. రాజ్‌కుమారి అమృత్‌కౌర్ - ఆరోగ్యం, వైద్య శాఖ
14. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ - పరిశ్రమలు

● భారత జాతి భవిష్యత్తు కోసం రాజ్యాంగం కావాలని, అందుకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కావాలని మొదటిసారి సుప్రసిద్ధ రాడికల్ మానవతావాది ఎం.ఎన్.రాయ్ అభిప్రాయపడ్డారు. అయితే అంతకుముందే రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని డిమాండ్లు ఉన్నాయి. 1918లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశం 'స్వయం నిర్ణయాధికారం' అనే భావనతో ఒక తీర్మానాన్ని ప్రకటించింది. ఇదే విషయాన్ని గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రస్తావిస్తూ 1922 జనవరి 5న 'భారత దేశానికి స్వాతంత్ర్యమనేది బ్రిటిష్‌వారు ఇచ్చే భిక్ష కాదని, భారతీయులు రాజకీయ భిక్షాటకులు కాదని, ప్రజలు తమను తాము అభివ్యక్తీకరించుకోడానికి గల స్వేచ్ఛ మాత్రమేనని' రాశారు. 1928 మే 19న మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగ రచనకు అఖిలపక్ష కమిటీ ఏర్పాటైంది. ఇది భారతీయులకే సొంత రాజ్యాంగ రచన కోసం జరిగిన నిర్మాణాత్మక కృషిగా పేర్కొంటారు. ఈ నెహ్రూ నివేదికలో భారతీయుల హక్కులు, ప్రభుత్వ పాలన, భిన్నవర్గాల ప్రయోజనాలను చర్చించారు.

● 1935 చట్టాన్ని ఏకపక్షంగా అమలుపరిచే ప్రయత్నం చేయడంతో 1936 జైపూర్ కాంగ్రెస్ సమావేశంలో దానిని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రత్యేక రాజ్యాంగ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. 1936లో జవహర్‌లాల్ నెహ్రూ 'హెరాల్డ్' పత్రికలో భారతీయులు తమను తాము పాలించుకోడానికి అవసరమైన చట్టాన్ని తయారుచేసుకొనే స్వేచ్ఛ కల్పించాలని రాశారు. ఈ అంశాన్ని 1935 నాటి హరిపుర కాంగ్రెస్ సమావేశం ఒక తీర్మానం రూపంలో ఆమోదించింది. భారతీయులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేస్తే కుల, మత, వర్గాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మహాత్మాగాంధీ 1939 నవంబరు 12న 'హరిజన' పత్రికలో రాశారు. ఈ డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1942 క్రిప్స్ ప్రతిపాదనల ద్వారా తొలిసారిగా రాజ్యాంగ పరిషత్ ఆవసరాన్ని గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఇంగ్లాండ్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రధాని అట్లీ, భారతీయులపై బల ప్రయోగం ద్వారా అధికారాన్ని చెలాయించలేమని నిర్ణయానికి వచ్చారు. 1945 సెప్టెంబరులో భారతీయులకు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు 1945 సెప్టెంబరు 19న నాటి వైశ్రాయ్ వేవెల్, ఢిల్లీ రేడియో కేంద్రం ద్వారా ప్రసంగిస్తూ 'అతి త్వరలో రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరుగుతాయి. వాటికి ఎన్నికైన ప్రతినిధులు రాజ్యాంగ సభ సభ్యులను ఎన్నుకుంటారు' అని పేర్కొన్నారు. 1946 నాటికి మంత్రిత్రయ రాయబారాన్ని అనుసరించి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



రాజ్యాంగ సభ నిర్మాణం: 1946 జూన్, జూలై నెలల్లో సభకు ఎన్నికలు జరిగాయి. నాటి గవర్నర్ జనరల్ ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక మిలియన్ జనాభాకు ఒక సభ్యుని చొప్పున 389 మంది సభ్యులకు ప్రాతినిధ్యం, మూడు భిన్నమైన వర్గాల నుంచి ప్రతినిధుల ఎంపిక జరిగింది. ఈ ఎన్నికలు నైసర్గిక ప్రాతినిధ్య పద్ధతి ఆధారంగా జరిగాయి.

1. బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి పరోక్షంగా ఎన్నుకున్నవారు 292
2. స్వదేశీ సంస్థానాల నుంచి నియమించిన వారు 93
3. చీఫ్ కమిషనర్ ప్రాంతాల్లో ఎన్నుకున్నవారు
4. మొత్తం 389 మంది.

నోట్: చీఫ్ కమిషనర్ ప్రాంతాలు నాలుగు అవి- 1) అజ్మీర్-మేర్వార్ 2) బెలూచిస్థాన్ 3) కూర్గ్ 4) ఢిల్లీ. - ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 208, ముస్లిం లీగ్‌కు 73, ఇతరులు 15 మొత్తం 296. స్వదేశీ సంస్థానాలు 93తో కలిపి మొత్తం 389.

- ముస్లింలీగ్ పాకిస్థాన్ డిమాండ్‌తో రాజ్యాంగ పరిషత్ నుంచి వైదొలిగింది. దేశ విభజన తరవాత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కి పడిపోయింది. ఇందులో బ్రిటిష్ పాలిత ప్రాంతాల ప్రతినిధులు 229, స్వదేశీ సంస్థానాల ప్రాతినిధ్యం 70 కలిపి మొత్తం 299.
- గాంధీ, జిన్నా రాజ్యాంగ సభకు ఎన్నిక కాలేదు.
- ముస్లింలకు, సిక్కులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు 15 మంది ప్రముఖులను నామినేట్ చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహిళలు: విజయలక్ష్మీ పండిట్, సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, హంసా మెహతా, రాజ్‌కుమారి అమృత్‌కౌర్.
- ఆంధ్ర ప్రాంతం నుంచి ఎన్నికైనవారు: టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవరెడ్డి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కల్లూరి సుబ్బారావు, కళా వెంకట్రావ్, ఆచార్య ఎన్.జి. రంగా, రామకృష్ణ రంగారావు, ఎం.సత్య నారాయణ.



వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

సివిల్ సర్వీసెస్ / ఐఎఫ్ఎస్ ఎగ్జామ్ 2024

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామ్ 2024 నోటిఫికేషన్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. సీఎస్ఈ ద్వారా 1056, ఐఎఫ్ఎస్ సర్వీస్‌లో 150 పోస్టులు భర్తీ చేస్తారు.

అర్హతలు: ఏదైనా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

దరఖాస్తు ఫీజు: ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5 **ప్రిలిమినరీ పరీక్ష:** మే 26

మెయిన్స్ పరీక్ష: అక్టోబరు 19 నుంచి **వెబ్‌సైట్:** upsconline.nic.in/

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్

నల్లగొండ, మిర్యాలగూడలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, మేథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ సీఎస్, బయాలజీ
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సైన్స్ సోషల్ సైన్స్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్.
3. ప్రీ ప్రైమరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్, యోగా ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్స్ కోచ్, మ్యూజిక్ టీచర్, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కోచెస్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 17

సమయం: ఉదయం 9 గంటల నుంచి

వెబ్‌సైట్: nalgonda.kvs.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/JWRKd0Cలో చదవండి.

హైదరాబాద్ ఐఐఐటీలో డిగ్రీ, డ్యూయెల్ డిగ్రీ



హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- బీటెక్, డ్యూయెల్ డిగ్రీ (బీటెక్+ఎంఎస్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రత్యేక అడ్మిషన్ మోడ్‌ల(ఎస్పీఈసీ, యూజీఈఈ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీటెక్: ఈ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్స్(ఎస్పీఈసీ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సీబీఎస్ఈ-ఉడాన్ స్కీంలో అర్హత పొందిన బాలికలు; జవహర్ నవోదయ విద్యాలయాల్లో పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

బీటెక్+ఎంఎస్: ఈ ప్రోగ్రామ్‌లో బీటెక్, ఎంఎస్(రీసెర్చ్) కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ఈసీఈలో 25 సీట్లు, సీఎస్ఈలో 35 సీట్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో 45 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకొన్న అభ్యర్థులు ఎంఎస్‌లో కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, కంప్యూటింగ్ అండ్ హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కో స్పెషలైజేషన్‌కు 15 సీట్లు ప్రత్యేకించారు. అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(యూజీఈఈ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: ఈ జూన్ నాటికి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **బీటెక్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** రూ.600
- **డ్యూయెల్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** పురుషులకు రూ.2,500; మహిళలకు రూ.1250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **వెబ్‌సైట్:** iiit.ac.in



చిరు విరామం

సినిమా షూటింగ్స్‌కు చిరంజీవి చిన్న బ్రేక్ ఇచ్చారు. శ్రీమతి సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్తున్నాను. తిరిగిరాగానే 'విశ్వంభర' చిత్రీకరణలో పాల్గొంటాను. అందరికీ ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'విశ్వంభర' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. 'బింబిసార' ఫేం వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. భారీ సెట్స్‌లో ఇటీవలే కీలక ఘట్టాలను తెరకెక్కించారు. చిరంజీవి తిరిగిరాగానే మరో షెడ్యూల్ ప్రారంభించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. 'విశ్వంభర'కు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



భామతో బచ్చన్

రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' అనేది ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి రవితేజ, భాగ్యశ్రీ బోర్సే రొమాంటిక్ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయని చిత్రబృందం తెలిపింది. ఇటీవలే కారంపూడిలో ఓ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. ఈ చిత్రానికి మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.

టైటిల్ ట్రాక్‌తో హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి నాయుడు నిర్మించారు. సుధీర్ బాబు సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'హరోం హర' అంటూ సాగే టైటిల్ ట్రాక్‌ను యూనిట్ బుధవారం విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించింది. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 1980ల్లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని యూనిట్ తెలిపింది. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళులు



వరుణ్‌తేజ్ తొలిసారిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మానుషి చిల్లర్ ఇందులో రాడార్ ఆఫీసర్‌గా, రుహానా శర్మ మరో కీలక పాత్రలో నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారత భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న వాహనాల కాన్వాయ్‌పై జరిగిన ఉగ్ర దాడిలో నలభై మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. పుల్వామా స్మారక ప్రదేశాన్ని హీరో వరుణ్‌తేజ్, మానుషి సహా 'ఆపరేషన్ వాలెంటైన్' టీమ్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాల స్ఫూర్తితో వాస్తవ సంఘటనల ప్రేరణతో రూపొందిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా



దర్శకుడు భాను

'ఈ సినిమాను మొదట 'అమరావతి టైమ్స్' పేరుతో తీశాం. కానీ సెన్సార్‌కు వెళ్లినప్పుడు ఫిక్షనల్ స్టోరీ అయితేనే సెన్సార్ చేస్తామని అధికారులు చెప్పారు. వారు చెప్పిన ప్రకారం మార్పులు చేసి, టైటిల్‌ను కూడా 'రాజధాని ఫైల్స్' అని మార్చాం. దీని వల్ల అదనంగా ఖర్చు అయి, బడ్జెట్ కూడా పెరిగింది' అని చెప్పారు దర్శకుడు భాను. ఆయన రూపొందించిన 'రాజధాని ఫైల్స్' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

● 'ఇది రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా. ప్రజల ఆవేదనను చూపించే ప్రయత్నం చేశాం. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని నమ్మి తమ భూములు ఇచ్చారు. మరో ప్రభుత్వం వచ్చి వారిపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతోంది. ప్రజలు నమ్మింది ప్రభుత్వాన్ని కానీ పార్టీలను కాదు. ఈ అంశాన్నే సినిమాలో చూపించాం' అని స్పష్టం చేశారు భాను.

● చిత్రీకరణ సమయంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి ఒత్తిళ్లు రాలేదని చెబుతూ 'అమరావతికి వెళ్లి అక్కడి బాధిత రైతులతో ఈ సినిమా చేశాం. వాస్తవ సంఘటన ఆధారంగా సినిమా తీస్తున్నప్పుడు ఆ సంఘటనను ఎదుర్కొన్న వారే అందులో నటించడం చాలా అరుదు. మా సినిమాలో బాధితులే తమ పాత్రలను పోషించారు' అని ఆయన తెలిపారు. సినిమాలో రైతు ప్రతినిధిగా వినోద్‌కుమార్, రైతు భార్యగా వాణీ విశ్వనాథ్ నటించారనీ, మణిశర్మ అద్భుతమైన సంగీతాన్ని అందించారనీ దర్శకుడు భాను తెలిపారు.

వినోదం.. అంతకుమించి



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' విడుదల కోసం తుది మెరుగులు దిద్దుకుంటోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. మొదటి భాగంలో రాధికతో ప్రేమ కారణంగా ఇబ్బందులు తెచ్చుకున్న టిల్లు ఇప్పుడు మరోసారి అదే తరహాలో సమస్యల సమూహంలో చిక్కు కున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అనుపమ లుక్స్‌తో పాటు ఆమె బాడీ లాంగ్వేజ్, సిద్ధుతో ఆమె కెమిస్ట్రీ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి.

వేసవిలో శశివదనే

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన గ్రామీణ ప్రేమ కథా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ్ బెల్లంకొండ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రేమికులుగా రక్షిత్, కోమలి జంట ఆకట్టుకుంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ ఆ పోస్టర్‌కు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్. సినిమాటోగ్రఫీ: శ్రీ సాయికుమార్ దారా



అన్నీ డబుల్ ఉంటాయి



ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామా కలాపం 2' వెబ్ సిరీస్ ఈ నెల 16 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను బాపినీడు, సుధీర ఈదర నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో ప్రియమణి మాట్లాడుతూ 'ఇందులో అన్నీ డబుల్ ఉంటాయి. థ్రిల్స్ ట్విస్టులతో పాటు కాస్త డేంజర్ కూడా ఉంది. ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. మహిళ తలుచుకుంటే ఏదైనా చేయగలదు అని చెబుతున్నాం' అన్నారు. మొదటి పార్ట్ చూసి రెండో పార్ట్ చూస్తే ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారని దర్శకుడు అభిమన్యు చెప్పారు. ఇందులో తనకు జుబేదా పాత్ర ఇచ్చిన దర్శకుడికి సీరత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సిరీస్ కోసం ఎంతో కష్టపడ్డామని మరో నటి శరణ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహా బిజినెస్ హెడ్ వాసు, ఎడిటర్ విప్లవ్ కూడా పాల్గొన్నారు.

అమ్మాయిలు ఇచ్చే షాక్.. అదే మెడిసిన్!



ఒక తెలుగు యువతి హీరోయిన్‌గా నటించడం, ఆ సినిమాకు ఆమె కథకురాలు, నిర్మాత కావడం అరుదు. 'డియర్ ఉమ' చిత్రంతో సుమయ రెడ్డి ఇలా తన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్నారు. పృథ్వీ అంబర్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'డియర్ ఉమ' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇదొక ప్రేమ కావ్యం అని టీజర్ చూశాక అనిపించింది. 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది. అమ్మాయిలు ఇచ్చే షాకులకు అబ్బాయిలకు ఇదే సరైన మెడిసిన్' వంటి డైలాగులు సినిమాలో డెప్త్‌ను చాటాయి.



8 వసంతాల ప్రేమ

'మధురం' ఫేం ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం ప్రకటించింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు. ఎనిమిది సంవత్సరాలలో ఓ అందమైన యువతి జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. దీనికి '8 వసంతాలు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

కాలం రాసిన ఆరు కథలు



సాగర్, వికాస్, అభిలాష్ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ విడుదల చేశారు. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్ జానర్‌లో ఈ చిత్రం రూపొందడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. మనం ఏదో అవుదామని వస్తే మరేదో అవుతాం. దానిని బట్టే జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ ఈ చిత్రానికి మంచి టైటిల్ ఎన్నుకోవడంలోనే సగం విజయం సాధించారు. పలు కథలను కలిపి సినిమా తీయడం అభినందనీయం' అన్నారు.

తండ్రీ కొడుకుల కథ



నటుడు ధన్‌రాజ్ దర్శకత్వంలో సముద్రఖని ముఖ్యపాత్రలో నటిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా 'రామం రాఘవం' చిత్రం గ్లింప్స్‌ను హీరో రామ్ పోతినేని, దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ఈ చిత్రంలో శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శివ ప్రసాద్ యానాల కథను సమకూర్చగా, అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మార్తాండ్ కే వెంకటేష్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Kdplrv5 లో చదవండి.



ముప్పాళ్ళలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కన్నాలక్ష్మీనారాయణ

జగన్ అండ్ కో ఓ దొంగల ముఠా

- ప్రజలను ఓట్లు అడిగే హక్కే లేదు వారికి లేదు
- టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ ఫిబ్రవరి 14: సంక్షేమం పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్న జగన్ అండ్ కో ఓ దొంగల ముఠా పార్టీ అనీ, వారికి ప్రజలను ఓట్లు అడిగే హక్కే లేదని మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రం ముప్పాళ్ళలో టీడీపీ కార్యాలయాన్ని కన్నా ప్రారంభించారు. అనంతరం కన్నా విలేకరులతో మాట్లాడుతూ.. 'సైకోను తరిమేద్దాం..' అన్న నినాదంతో ప్రజలు ఎన్నికల సమరానికి సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. జగన్‌రెడ్డి సంక్షేమం పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్నారనీ, ప్రజలకు రూ.10 ఇచ్చి వారి వద్ద నుంచి రూ.1000 నొక్కేశాడని అన్నారు. తన అనుచరుల కంపెనీలలో నాసిరకం మద్యం తయారు చేయించి, ప్రభుత్వమే అమ్ముతూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని దుయ్యబట్టారు. సామాన్య ప్రజలపై అన్ని రకాల ధరల పెనుభారాలను మోపిన విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నకలలో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు జగన్‌రెడ్డి అక్రమ సంపాదనలో ఎవరెస్టు ఎత్తును అధిగమించాడని, ఈ సారి అవకాశమిస్తే సర్వం దోచేస్తాడని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు, మండల టీడీపీ అద్యక్షులు బత్తుల నాగేశ్వరావు, మండల టీడీపీ పరిశీలకుడు ఆళ్ళ సాంబయ్య, రావిపాటి మధుబాబు, సర్పంచ్‌లు యలమందరావు, చంద్ర శేఖర్, నేతలు పలువురు పాల్గొన్నారు.

బాండ్ల ప్రకారం బీమా మొత్తాన్ని చెల్లిస్తాం

- శుభం కోల్డ్ స్టోరేజి యజమాని శ్యాంకుమార్

దుగ్గిరాల, ఫిబ్రవరి 14: కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు వారిసరుకు నిల్వపత్రాల వివరాల ప్రకారం బీమా మొత్తం చెల్లిస్తామని శుభంమహేశ్వరి కోల్డ్‌స్టోరేజి యజమాని శ్యాంకుమార్ తెలిపారు. దుగ్గిరాలలో గత నెల 19న జరిగిన అగ్నిప్రమాదంలో 1లక్షా 16వేల బస్తాల పసుపు దగ్ధమైన విషయంవిదితమే. కాగా శ్యాంకుమార్‌కు కాలిన గాయాలతో ఆసుపత్రి పాలై, చికిత్స అనంతరం బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం దురదృష్టకరమని, తమ వద్ద సరుకు నిల్వపెట్టుకున్న సమయంలో రైతులకు యిచ్చిన అంగీకార పత్రాల ఆధారంలో బీమా మొత్తాన్ని ఆయా కంపెనీల నుంచి వచ్చిన వెంటనే వారికి అందజేస్తామన్నారు. సుమారు 600 మంది వరకూ రైతులు సుమారు రూ.40 కోట్ల విలువగల పసుపు తమ కోల్డు స్టోరేజీలో నిల్వ పెట్టుకున్నారన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించారని, డ్రోన్ కెమెరాల సాయంతో వీడియోలు కూడా తీసి, పూర్తిస్థాయిలో విచారణ జరిపారని, రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. బీమా మొత్తంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్యామ్‌కుమార్ అల్లుడు విజయకృష్ణ తెలిపారు.

మిర్చి రైతు.. ఉసూరు

- మిర్చి అమ్మాక మిగిలింది కన్నీరే
- క్వింటాలుకు రూ.15 వేలు పడటం గగనమే
- పలుకుతున్న ధరకు.. పెట్టుబడికి మధ్య తీవ్ర అగాధం
- సరుకు దించేసి కూలీ పనులకు వెళుతున్న కర్నూలు రైతులు
- ఇంటికి వెళ్తే అప్పులిచ్చినోళ్ళకి మొఖం చూపలేమని ఆవేదన



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 14: పంట అమ్ముకున్నాక జేబు నిండా సొమ్ము.. ముఖం నిండా నవ్వుతో రైతులు ఇంటి బాట పట్టేవారు. ఇప్పుడు మిర్చి అమ్ముకుంటున్న రైతులు కళ్ళనిండా నీళ్ళు.. గుండెనిండా బాధతో వెనుతిరుగుతున్నారు. పెట్టిన పెట్టుబడికి.. పలుకుతున్న మిర్చి ధరకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడుతుండగా అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఎన్నో ఆశలతో వందల కిలోమీటర్లు దాటి ఇక్కడ కు పంట తీసుకొస్తున్న మిర్చిరైతులు ధరలు చూసి నీరుగారి పోతున్నారు. తెలంగాణ, కర్నూలు రైతుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. పంట అమ్మగా పెట్టుబడిలో సగభాగం సొమ్ము కూడా రాకపోతుండటంతో రాయలసీమ నుంచి వచ్చిన రైతులు కూలీ పనుల కోసం ఇక్కడే ఆగిపోతున్నారు.

పొంతనే లేదు.. ఈ ఏడాది మిర్చి పంట సాగుచేసిన రైతులకు విచిత్ర పరిస్థితి ఎదురైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పతనం అయింది. ఒక్కో రైతు ఎకరా మిర్చి సాగుకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. మధ్యలో వచ్చిన తుఫాను ప్రభావంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఆ తరువాత తెగుళ్ల దాడి కూడా ఆరంభమైంది. దిగుబడి పూర్తిగా పడిపోయింది. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో ఎకరాకు 7 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. స్థానికంగా పంటను చాలా తక్కువ ధరకు అడుగుతుండటంతో ఎన్నో వ్యయప్రయాసలకు కోర్చి గుంటూరు యార్డు తీసుకొస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చాక గుండెల్లో రాయి పడుతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం యార్డులో క్వింటాలు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు కొంటున్నారని అంటున్నారు. ఈ ధరకు అమ్మితే పెట్టుబడి సగానికి సగం కూడా రాదని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి యార్డులో క్వింటాలు కనీసం రూ.18 వేల నుంచి రూ.20 వేలన్నా పడుతుందన్న ఆశతో వస్తే వ్యాపారులు పూర్తిగా తమను ముంచేస్తున్నారని చెబుతున్నారు. కొద్ది సొమ్ముతో ఇళ్లకువెళ్లి అప్పులిచ్చిన వాళ్ళకి మొఖం ఎలా చూపించాలో అర్థం కావటం లేదని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ముందు ఒక రేటు.. తరువాత ఒక రేటు

- ప్రభాకర్, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా



ఎకరాకి పెట్టుబడి రూ.2 లక్షలు అయింది. దిగుబడి కూడా చాలా తక్కువ వచ్చింది. గుంటూరు యార్డుకు వస్తే మంచి రేటు వస్తుందనుకుంటే ఇక్కడ వ్యాపారులు బాగా మోసం చేస్తున్నారు. ముందు ఒక రేటు చెప్పి మచ్చుకాయలు తీస్తున్నారు. తర్వాత వచ్చి కాయలు మెత్తగా ఉన్నాయి.. బాగా లేదు అని రేటు తగ్గించేస్తున్నారు. మేము పూర్తిగా నష్టం పోయాం.

ఇళ్లకు లేదు.. కూలీ పనులకే..

- దేవదాసు, గంగవరం, కర్నూలు జిల్లా



నాకు ఎకరాకు 5 క్వింటాలు దిగుబడి వచ్చింది. చాలా నష్టం వచ్చింది. ఇక్కడ వచ్చే డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్తే షావుకారు బతకనియ్యడు. మా వాళ్ళంతా ఇటునుంచి ఇటే కూలీ పనులకు వెళ్తున్నారు. కూలీ చేసి అప్పులు తీర్చాల్సిందే.

చావే శరణ్యం..

- దేవరాజు, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా



నేను రెండు ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. మొత్తం కౌలు పొలమే. రూ.4 లక్షలు దాకా అప్పు అయ్యింది. పంట అంతా అమ్మినా రూ.80 వేలు కూడా రాలేదు. వాటిని ఎవరికని కట్టాలి. ఇంటికి పోతే అప్పులోళ్లు బతకనీయరు. చావు తప్ప వేరే శరణ్యం లేదు.

ఇక్కడ అంతా మోసమే..

- దినేష్, గంగవరం, కర్నూలు జిల్లా



ఎక్కడ నుంచో పంట తీసుకుని వస్తే ఇక్కడ అంతా మోసం తప్ప ఏమీ లేదు. మూడు రోజులుగా అల్లాడుతున్నాము. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. రేట్ రోజు రోజుకి తగ్గిస్తున్నారు. రూ.15 వేలు పడాలంటే దేవుడు కనిపిస్తున్నాడు.

రూ.25 వేలు పడితేనే గిట్టుబాటు..


- తిమ్మన్న, అమరావై, జోగులాంబ గద్వాల్ జిల్లా



మేము పెట్టిన పెట్టుబడికి పడుతున్న రేటుకి సంబంధం లేదు. మాకు దిగుబడి అసలు లేదు. తెగుళ్ల వల్ల చాలా నష్టపోయాము. ఇక్కడకు వస్తే ధర వస్తది అని వస్తే ఇక్కడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వ్యాపారులు కుమ్మక్కు అయ్యారు. రేట్ బాగా తగ్గిస్తున్నారు. మిర్చి క్వింటాలుకు రూ.25 వేలు అన్నా పడితేనే మేము కోలుకుంటాము.

ఏడుస్తూ పోతున్నాము..

- చంద్రన్న, అమరావై, జోగులాంబ గద్వాల్ జిల్లా



మిర్చి రైతులు అందరూ సరైన ధర రాక బాధలో ఉన్నారు. మాకు దిగుబడి పూర్తిగా పడిపోయింది. అంత పంట అమ్మితే చాలా తక్కువ డబ్బు వస్తుంది. ఇక్కడనుంచి వెళ్లేటప్పుడు ఏడుస్తూ పోతున్నాము.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడు ముక్కలాట ముగిసిపోయింది

- హైద్రాబాద్ ఉమ్మడి రాజధాని అని జగన్‌రెడ్డి మరో నాటకం
- అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని.. మార్పు చేస్తే సహించేది లేదు
- 1520వ రోజుకు చేరుకున్న రైతులు

తుళ్ళూరు, ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వం ఆడుతున్న మూడు రాజధానుల మూడుముక్కల ఆట ముగిసిపోయిందని, ఇప్పుడు ఉమ్మడి రాజధాని హైద్రాబాద్ అని సీఎం జగన్‌రెడ్డి మరో నాటకానికి తెరలేపాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1520వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నాశిబిరాల నుండి వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో వైసీపీ నేతలు కారుచౌకగా కొన్న భూముల విలువను భారీగా పెంచుకోవటానికి అమరావతిని నిర్వీర్యం చేసి విశాఖ రాజధాని అంటూ ఊదరగొట్టారన్నారు. కానీ ఇప్పటికైనా, ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉంటుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడకొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.



సమావేశం నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్‌కుమార్

ఎన్‌డీఎస్‌ఏ బృందం సాగర్ ప్రాజెక్టు సందర్శన

- విద్యుత్ ఉత్పాదక కేంద్రాల పరిశీలన.. వివరాల సేకరణ

విజయపురిసౌత్, ఫిబ్రవరి 15: సాగర్ ప్రాజెక్ట్ దిగువనున్న జల విద్యుత్ ఉత్పాదక కేంద్రాలను బుధవారం ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) బృందం సందర్శించింది. జలాశయంలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పాదన వివరాలను, టర్బైన్లలో వచ్చే సాంకేతి సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను, కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి నీరు విడుదలయ్యే తీరు, వాటిని విద్యుత్ ఉత్పాదక కేంద్రంలోకి మళ్లించే తీరును జెన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా విజయవిహార్ బోర్డు రూమ్‌లో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్‌కుమార్ జెన్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం, భద్రత, నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి తదితర వాటిపై జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌డీఎస్‌ఏ బృందంలో డైరెక్టర్ ఆశిష్‌కుమార్, మహేంద్రసింగ్, డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్‌జిషన్, సాంకేతిక నిపుణుడు రాకేష్, ఇంజనీర్ కుమార్, ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈ విజయలక్ష్మి, డీఈ సతీష్, సాగర్ సీఈ మురళీధరరెడ్డి, కృష్ణా రివర్ బోర్డు ఎస్ఈ వరలక్ష్మిదేవి, ఈఈ శ్రీహరి, తెలంగాణ సీఈ విజయకుమార్, ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.



తులసీ ధర్మచరణ్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, వేద సీడ్స్ సిబ్బంది

ఘనంగా తులసీ ధర్మచరణ్ జన్మదిన వేడుకలు

- వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ

గుంటూరు, ఫిబ్రవరి 14: వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ జన్మదిన వేడుకలు గుంటూరు నగరంలోని వేద సీడ్స్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ.చంద్రశేఖర్, పలువురు సిబ్బంది, అభిమానుల సమక్షంలో ధర్మచరణ్ కేక్ కట్ చేశారు. ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కష్టం, స్వయంకృషికి మారుపేరు ధర్మచరణ్ అని, పట్టుదలే ఆయన విజయరహస్యమని, చిన్న వయస్సు నుంచే సేవని ఇంటి పేరుగా మార్చుకొని, ఎంతో మంది పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థికంగా వెన్నంటే ఉంటున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రత్యక్ష రాజకీయాల ద్వారా తన దైనశైలిలో ప్రజా సమస్యలపై పోరాడి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో, వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మచరణ్ సన్నిహితులు, హోటల్ సుభాని నిర్వాహకులు తాడి శ్రీనివాస్, తిమ్మిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం బ్రమ రాంబపురం కాలనీలో లిమాహోమ్ ఆశ్రమ పాఠశాలలోని చిన్నారులకు, రెడ్డిపాలెం మానవతా వృద్ధాశ్రమంలో డొంకెన మురళీకృష్ణ, ఆర్ఆర్‌కే క్యాటర్స్ అధినేత రేజేటి రామకృష్ణ ఆధ్వర్యంలో, నల్లచెరువులోని నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ.. తానెప్పుడు మెగాస్టార్ చిరంజీవి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు విధేయుడుగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని తనను దిశానిర్దేశం చేస్తే ఖచ్చితంగా గెలిచి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, సుంకర సతీష్, చెన్నంశెట్టి శివ, ఎంఎస్ఆర్ ఆంజనేయులు, కన్నసాని బాజీ, యర్రబోతు వాసు, కన్నెగంటి బాలు, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, రేజేటి రామకృష్ణ, తన్నీరు శివశంకర్, వీరిశెట్టి సుబ్బారావు, గుర్రాల రంగారావు, గణేష్, చందు, శ్రీనివాసరావు, సతీష్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

- ప్రయాణంలో ఫిట్స్ వచ్చి విద్యుత్ స్థంభాన్ని ఢీకొని ప్రమాదం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14: తెనాలి మండలంలోని కంచెర్లపాలెం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘనట బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి పట్టణం చెంచుపేటకు చెందిన నగేష్(48) ఆటోనగర్ నుండి కంచర్లపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. మార్గ మధ్యలో అతడికి ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి కరెంట్ పోల్‌ను ఢీకొంది. కిందపడిపోయిన నగేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ సానుభూతి పరుడుగా మంచి గుర్తింపు ఉన్న నగేష్ మృతి చెందాడన్న వార్త తెలుసుకుని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులు నగేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయం

- జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- బకాయిలువిడుదల చేయాలని కలెక్టరుకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు, ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి14: ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకి దిగజారుతుందని, స్కూలు, కాలేజీ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితులలో ఉన్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు రావాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని గుంటూరుజిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులతో కఠినంగా వ్యవహరిస్తుందని, ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు మంత్రుల కమిటీ చర్చలు జరిపారని, వాయిదాల పద్ధతిలో ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఏది ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసినప్పటికి ఇంతవరకు సిబ్బందిని నియమించలేదన్నారు. కార్యాచరణలో భాగంగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్, నేతలు ఏ.శ్యాం సుందర్, కే.శ్రీనివాసరావు, కే.శివజ్యోతి, సూరి, సీహెచ్ కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసరావు, విజయ లక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్, ఏపీటీఎఫ్, ఖాజనా శాఖ అధ్యక్షుడు కే.నరసింహారెడ్డి, బసవలింగరావు, అలీ, ఆంజనేయులు పాల్గొన్నారు.



నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన నిడుబ్రోలు వైసీపీ నాయకులు

అరాచక వైసీపీని ఇంటికి సాగనంపుదాం

- మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి14: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపటానికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నేతలకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అణిచివేతకు గురయ్యాయారని, వారి ఓట్లతో అధికారంతోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ ప్రజలపైనే దారుణాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దళితులకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఇలాంటి అవినీతి అరాచక ప్రభుత్వాని సాగనంపేందుకు ప్రతి ఒక్కరు టీడీపీ, జనసేన కూటమిని బలపరచాలని, నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. టీడీపీలో చేరిన వారిలో నిడుబ్రోలుకు చెందిన యాతాటి అవసంతరావు, మంద్రు సురేష్, పాములపాటి సురేష్, కర్ర సతీష్, రాతిక్రింద సురేష్, దూళ్ల లింకన్, భట్టు షరాక్, దొప్పలపూడి రాజ్‌కుమార్, పతెళ్ల నాగరాజు, యాతాటి శేషయ్య, కసుకుర్తి కోటేశ్వరరావు, నిమ్మగడ్డ రాము తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, గోగినేని రజనీ కుమార్ పాల్గొన్నారు



భవిష్యత్ గ్యారెంటీ ప్రచారంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

హైదరాబాద్ రాజధాని అంటూ మరో కుట్ర

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: ప్రజారాజధాని అమరావతిని పొట్టన పెట్టుకున్న వైసీపీ ప్రభుత్వం నేడు హైదరాబాద్ మన రాజధాని అంటూ కొత్త కుట్రలకు తెర లేపిందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో బుధవారం టీడీపీ నేతలు 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని వర్తకుల వద్దకు వెళ్ళి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేయనున్న పథకాలను వివరించారు. పూలు, పండ్ల విక్రయ దారులతో మాట్లాడి వ్యాపారాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారవర్గాల వారితో పుల్లారావు మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్ కోసం 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగాలకు పాతరేసిన జగన్‌రెడ్డి ఇప్పుడు హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాలంటూ కొత్త పల్లవి అందుకోవటం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. స్థానిక కూరగాయాల మార్కెట్‌కు స్వాతంత్ర్య సమరయోధులు చంద్రమౌళి పేరును తొలగించి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టారని, టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రమౌళి పేరును పునరుద్ధరించి శాశ్వితంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

బాపట్లలో అరుదైన 'పునుగుపిల్లి'



పునుగు పిల్లి

బాపట్ల, ఫిబ్రవరి 14 : అరుదైన పునుగుపిల్లి బాపట్ల పట్టణంలో కనిపించింది. పటేల్‌నగర్ 2వ లైన్‌లో గోరంట్ల శ్రీనివాసరావు గృహంలోని నీటిబావిలో పడింది. బుధవారం బావిలో దానిని చూచిన శ్రీనివాసరావు బక్కెట్‌తో బయటకు తీశాడు. చూడటానికి వింత ఆకారంలో ఉన్న దానిని ముంగిస జాతిలోని జీవి అని భావించాడు. తోక పొడవుగా నక్కతోకలాఉంది. దీంతో దాని గురించి అటవీశాఖ ముత్తాయపాలెం బీట్ ఆఫీసర్ పీ.శ్రీనివాసరావుకు తెలియజేశారు. ఆయన వచ్చి చూచి మొదట్లో ఏదో వింతజీవి అనుకొని తర్వాత గూగుల్‌లో చెక్ చేసి దానిని పునుగు పిల్లిగా పేర్కొన్నారు. అంతరించిపోతున్న పునుగుపిల్లిలు కనిపించటంలేదని, అరుదగా ఉంటున్న ఇది పట్టణ నడిబొడ్డుకు ఎలా వచ్చిందో అర్థం కావటంలేదన్నారు. నీటిలో తడిచిన పునుగుపిల్లి మొదట కదలకుండా మెదలకుండా ఉండి, ఫారెస్ట్ అధికారులు పట్టుకోవటానికి ప్రయత్నించగా దానిని పట్టుకునేందుకు ఫారెస్ట్ సిబ్బంది నానా తిప్పలు పడ్డారు. చివరకు పట్టుకొని దానిని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఫారెస్ట్‌లో వదిలిపెడుతామని బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.36
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

1,16,434 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,04,737 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,16,434 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 90,110 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20500
నెంబరు. 5	10000	21000
273	12000	17500
341	10500	21000
4884	14000	17500
సూపర్ 10	15000	15200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	22000
దేవనూరు డీలక్స్	9500	21000
తెల్లకాయలు	5500	13000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలు అందజేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ఒక్క సిమెంట్ రోడ్డుకూ నోచుకోని బాపట్ల

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వ పాలనలో బాపట్లలో ఒక్క సిమెంట్ రోడ్డు కూడ వేయలేకపోయారని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట కార్యక్రమాన్ని బుధవారం తెలుగుదేశం, జనసేనపార్టీ సంయుక్త ఆధ్వర్యంలో 13వవార్డు యాదవపాలెంలో నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలు పంచిపెట్టారు. ఉమ్మడి మేనీఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి వార్డులో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. వైసీపీనాయకులు మెయిన్‌రోడ్డు ఒకటి వేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బాపట్ల పట్టణంలో ఒకేపెట్రోల్‌బంకు ఉందని మిగిలినవాటికి అనుమతులివ్వకుండా ఎమ్మెల్యే కోన రఘుపతి అడ్డుకున్నారని ఆరోపించారు. ఆయన బంకులోనే పెట్రోల్ పోయించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ విధంగా చేశారన్నారు. ఒకవైపు ఇసుక దోపడి చేస్తున్నారన్నారు. మరోవైపు ప్రతిచోట గంజాయి దొరికే విధంగా చేశారన్నారు. గంజాయిమత్తులో యువత భవిష్యత్తు నాశనమౌతుందని హత్యలకు దారితీస్తున్నదని దీనికి ఎమ్మెల్యే కోన రఘుపతి నైతికబాధ్యత వహించాలన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ అధికమెజార్టీతో గెలవటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణపార్టీఅధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పరీద్‌మస్తాన్, దండమూడి సంధ్యారాణి, రమాదేవి, టీడీపీ,జనసేననాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతికి టిక్కెట్టు ఇవ్వద్దని కోరుతున్నాం : ముప్పిరి

బాపట్ల, ఫిబ్రవరి 14 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కోన రఘుపతికి బాపట్ల టిక్కెట్టు ఇవ్వద్దని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిరి రాజశేఖర్ అన్నారు. ఈవిషయమై బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను మాత్రమే కరెక్ట్ మిగతా వారు అవినీతిపరులే అన్నట్లు ఎమ్మెల్యే కోన మాట్లాడటం సరికాదన్నారు. కోన ప్రభాకరరావు గవర్నర్‌గా పనిచేస్తున్న సమయంలో అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారని ఆరోపణలు కూడా ఉన్నాయన్నా రు. ప్రస్తుతం ఎమ్మెల్యే కోన మీద కూడా అవినీతి ఆరోపణలు చాలా వచ్చాయన్నారు. అందుకే ఒకరిని విమర్శించే ముందు మనం ఆత్మవిమర్శ చేసుకోవాలని రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే కోన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి అక్రమాలపై ఆయన చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి : దేవరాజు

బాపట్ల, ఫిబ్రవరి 14 : రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు ప్రజలను కోరారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఢిల్లీలో రైతులు నిరసన తెలియజేయడానికి వస్తుంటే రాకుండా అడ్డుకొని పొగబాంబులు వేసి నిర్వీర్యం చేయటం దుర్మార్గమన్నారు. బీజేపీ చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను అధికార, ప్రతిపక్షపార్టీలు ప్రశ్నించకపోవటం సిగ్గుచేటు అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని దేవరాజు కోరారు.

ఓట్ల తొలగింపులో నిర్లిప్తంగా వ్యవహరించిన వారిపై చర్యలు : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 14 : ఓటర్ల ఫోటోలు డబల్‌ఎంట్రీలు, మృతుల ఓట్లు తొలగింపులో నిర్లిప్తంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు తొలగించలేదని వస్తున్న ఆరోపణలపై సుమోటోగా ఫిర్యాదులు స్వీకరించి విచారిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50 మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులపై 2,08,740 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 32,056 దరఖాస్తులను తిరస్కరించామని, 906 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మిగిలినవన్నీ పరిష్కరించామన్నారు. ప్రతిరోజు ఆన్‌లైన్ ద్వారా సుమారుగా 500 దరఖాస్తులు నమోదవుతున్నాయని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నికలు జరిగే ముందు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సవరణ చేసిన తుదిజాబిత ప్రచురిస్తామన్నారు. అన్ని రాజకీయపార్టీలకు వాటిని అందిస్తామన్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1500మందికి మించి ఓటర్లు ఉంటే అలాంటి ప్రాంతాల్లో ఓటర్ల సౌలభ్యం కోసం 2వ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఏవో కృష్ణకాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు నివాళి

బాపట్ల, ఫిబ్రవరి 14: ఎస్సీ సామాజిక వర్గం నుంచి తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన గొప్ప వ్యక్తి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజదెబోరా, సహాయ సంక్షేమ అధికారులు సత్యనారాయణ, సైదారెడ్డి, యు వ స్వరూప, ఆశాఖ పర్యవేక్షకులు ఏ.శ్రీనివాసరావు, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగియుండాలి

బాపట్ల, ఫిబ్రవరి 14: మహిళా చట్టాలపై అవగాహన కలిగియుండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ ఉసురుపాటి సుబ్బారావు తెలిపారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ చట్టాలు, హక్కులు, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందటంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్యంలో ఆడబిడ్డలకు వివాహం చేయరాదన్నారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కన్వీనర్ హేమలత మాట్లాడుతూ సమాజాభివృద్ధిని ఆ సమాజంలో మహిళల అభివృద్ధితో లెక్కిస్తానని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్న మాటలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మెప్మా రీసోర్స్‌పర్సన్ సరోజనీ, రోజ్ సంస్థ ప్రతినిధి పొందుగల ప్రసాదరావు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుదే రాజారావు, కొచ్చెర వినయ్‌రాజు, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్లు వి.భగవాన్‌దాసు, పి.వీరయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

● డీటీవో సురేష్

బాపట్ల, ఫిబ్రవరి 14: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని డీటీవో సురేష్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపుసభ బుధవారం బాపట్ల ఆర్టీసీ గ్యారేజిలో నిర్వహించారు. కార్యక్రమానికి డీటీవో సురేష్, డీఎస్పీ టి.వెంకటేశ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని ప్రతి ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేసి సత్కరించారు. ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె డిపో మేనేజర్లు ట్రాఫిక్ మెకానిక్ ఇన్ చార్జిలు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మొదలెట్టారు...!

- 17న ఇంకొల్లులో రా..కదలిరా బహిరంగ సభ
- పోలీసులను అడ్డం పెట్టుకుని కుట్రకు తెరలేపిన పాలకులు
- పనులు ఆపాలంటూ హుకుం
- టీడీపీ నేతలను స్టేషన్‌కు రావాలంటూ ఆదేశాలు
- అనుమతుల్లేవంటూ హడావిడి

బాపట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లు మండల పరిధిలో ఈ నెల 17న జరిగే రా..కదలిరా... కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎప్పటిలాగానే తనకు అలవాటైన రీతిలో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టింది. రైతుల అంగీకారంతోనే ఇచ్చిన దాదాపు 25 ఎకరాల స్థలంలో సభ ఏర్పాట్లను చేస్తున్నారు. సభకు ఇచ్చిన స్థలంలో కొంత భాగం దేవదాయ శాఖకు చెందినదని ఆ విభాగం అనుమతులు తీసుకోలేదని వారు ఫిర్యాదు చేశారని బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చిన పోలీసులు హడావిడి చేశారు. సదరు విభాగం ఇచ్చిన ఫిర్యాదు కాపీని చూపమని అడిగినప్పటికీ పోలీసుల నుంచి స్పందన కరువైందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

విజయవంతం అవుతుందనే అక్కసుతోనే...

పర్చూరు నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన రెండు రోజుల క్రితమే ఖరారయింది. సభ కోసం కావాల్సిన స్థలం ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా సహకరించడంతో ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. బుధవారం ఆ ప్రాంగణంలో భూమిపూజ జరగడంతో పాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాయకులతో అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సన్నాహక సమావేశం కూడా నిర్వహించారు. సభ విజయవంతం కానుందనే సమాచారం నేపథ్యంలో తాడేపల్లి పెద్దల ఆదేశాలతో అనుమతుల పేరిట కొత్త కుట్రకు తెరలేపారని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

పనులు ఆపాల్సిందే....

సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు ఏర్పాట్లను ఆపాల్సిందేననే హుకుంను జారీ చేయడంతో పాటు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలను ఇంకొల్లు స్టేషన్‌కు రావాలని కూడా తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఎందుకు ఏర్పాట్లు ఆపాలో రాతపూర్వకంగా ఇవ్వాలని దానికి దేవాదాయ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు కాపీని కూడా జతచేయమని టీడీపీ నేతలు అడిగారు. దానికి సమాధానంగా స్టేషన్‌కు వచ్చి డీఎస్పీ, సీఐతో మాట్లాడుకోమనే సమాధానం వచ్చింది తప్పితే ఆధారాలు చూపలేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇంకొల్లు పోలీస్‌స్టేషన్‌కు టీడీపీ నేతలు వెళ్లేసరికి అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోగా ఫోన్‌లో కూడా స్పందించకపోవడం గమనార్హం.

ప్రజాక్షేత్రంలో ఎండగడతారనే...

పర్చూరు నియోజకవర్గంలో జరిగిన ఓట్ల అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. వీటిపై పోరాడిన ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగా ఇటీవల ప్రభుత్వం అక్రమ కేసులకు తెరలేపింది. గ్రానైట్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా పాలకులు కక్షసాధింపులకు దిగడం, ప్రైవేటు సైన్యంతో అధికారులు ఫ్యాక్టరీలలో సోదాలు నిర్వహించడం వంటివన్నీ జనాల్లో చర్చకు దారితీశాయి. వీటన్నింటితోపాటుగా పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వసూళ్ల పర్వం నడిపిన తీరు కూడా ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. చంద్రబాబు సభ నేపథ్యంలో ఈ అంశాలన్నింటినీ ప్రజాక్షేత్రంలో ఆయన ఎండగడతారనే భయంతోనే సభకు ఏదో విధంగా అవాంతరాలు సృష్టించే ప్రయత్నం చేస్తుందని టీడీపీ నేతలు మండిపడుతున్నారు


ఏర్పాట్లకు అనుమతుల్లేవంటూ సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు

రాత్రి వేళ తమను ఇలా...

చట్టబద్ధంగా అన్ని అనుమతులు తీసుకుని సభ ఏర్పాట్లను ప్రశాంత వాతావరణంలో చేసుకుంటున్న తమను రాత్రి వేళ పోలీసులు వచ్చి కక్ష గట్టినట్లు వ్యవహరించడం పట్ల టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా తాము అడిగిన ప్రశ్నలకు పోలీసుల నుంచి సమాధానమే కరువైందని, పైగా తమను రాత్రి వేళ స్టేషన్‌కు రమ్మని హెచ్చరించారని శ్రేణులు వాపోయాయి. అక్కడకు వెళితే కనీసం స్పందించే వారే కరువయ్యారని, ఈ చర్యలన్నీ కేవలం వేధించడానికే చేస్తున్నారని ప్రజలు ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం తథ్యమని నేతలు తెలిపారు.

బాబు సభకు అడ్డంకులా? ఏలూరి

అమరావతి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో నిర్వహించే రా.. కదలిరా సభకు అధికార పార్టీ అడ్డంకులు సృష్టించడంపై బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా మండిపడ్డారు. ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాక పోలీసులను అడ్డంపెట్టుకుని, అధికార పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు సభకు జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్ని అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేయడంతో పాటు హెలిపాడ్‌కు ఆర్అండ్‌బీకీ దరఖాస్తు చేసినట్లు ఆయన బుధవారం మీడియాకు చెప్పారు. ఇంకొల్లులోని పావులూరు రోడ్డులో ఓ రైతు లీజుకు తీసుకున్న దేవదాయశాఖ భూమిలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్న సమయంలో దేవదాయశాఖ అధికారులు ఫిర్యాదు చేశారంటూ పనులు నిలిపివేయాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారన్నారు. రైతు లిఖితపూర్వక అంగీకారంతోనే పనులు పూర్తి చేయగా, సభను భగ్నం చేయడానికి ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. పోలీసులతో వైసీపీ ప్రభుత్వం తన మార్కు రాజకీయానికి తెరదీసిందని విమర్శించారు.

ఆధునికీకరించిన అర్బన్ బ్యాంకు ప్రారంభం

బాపట్ల, ఫిబ్రవరి 14: పట్టణంలోని రథం బజారులో ఆధునికీకరించిన అర్బన్ బ్యాంకును ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవారం ప్రారంభించారు. బాపట్ల కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆధునికీకరించి కింద అంతస్థులో ఖాతాదారులు, డిపాజిట్‌ల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులతో సమానంగా అర్బన్‌బ్యాంక్ అభివృద్ధి చెందాలని ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ గర్నేపూడి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బి.హరినాధమురళీ, బి.సంగమేశ్వరశాస్త్రి, ఇనపగోళ్ళ రంగారావు, పులిపాక రఘురాం, ఉమామహేశ్వరరావు, ఆనంద్, బ్యాంక్ ఇన్‌చార్జి సెక్రటరి గోపాల్, బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు శ్రీహరి ప్రకాష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం వైద్యకేంద్రాల ఏర్పాటు

కర్లపాలెం, ఫిబ్రవరి 14 : మండలంలోని దమ్మనవారిపాలెంలో నూతనం గా నిర్మాణం చేసిన హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, గ్రామసర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటితో నిండిన చెరువు.. అయినా రోజు మార్చి రోజే తాగునీరు

బాపట్ల, ఫిబ్రవరి 14 : డెడ్‌స్టోరేజికి చేరిన సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను ఎట్టకేలకు పూర్తి స్థాయి నీటితో నింపారు. ప్రస్తుతం 24అడుగుల సామర్థ్యం కలిగిన తాగునీటి చెరువులో పూర్తి స్థాయి నీరు చేరింది. దీంతో ఇంజన్లు ఆపివేసి మున్సిపాలిటి మోటర్ల సాయంతోనే నీటిని డంప్ చేస్తున్నారు. చెరువులో నీరు సుమారు మూడునెలలు పాటు వచ్చే అవకాశం ఉంది. అయితే పులిచింతలలో నీటి పరిమాణం తక్కువగా ఉంది కావున కాల్వలకు నీరు వస్తుందో రాదో అనే అనుమానంతో మున్సిపల్ అధికారులు ఇకపై రోజు మార్చి రోజు మాత్రమే నీటిని సరఫరా చేసే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. దీని వల్ల మురికివాడల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. దీనికితోడు అనేకచోట్ల పైపులైన్‌లు లీక్‌లు ఏర్పడి నీరు వృధా అవుతూ చివరి కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా కావటంలేదు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి : తాండ్ర

బాపట్ల, ఫిబ్రవరి 14: పుల్వామలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన 40 మంది భారతీయ జవాన్‌లకు మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. మాజీ సైనికులతో కలిసి పురవీధుల్లో జోహార్లు అర్పిస్తూ ర్యాలీ చేశారు. ర్యాలీకి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరుజిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, బాపట్ల ఉపాధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరి సయ్యద్ అఖిల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వీరసైనికులకు జోహార్లు

కర్లపాలెం, ఫిబ్రవరి 14: పాకిస్థాన్ ఉగ్రమూకల దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ఘన నివాళులు అర్పిస్తున్నామని మాజీ సైనికులు, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి అన్నారు. మరో ప్రకటనలో మాజీ సైనిక సంక్షేమసంఘం అధ్యక్షుడు నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు వీర సైనికులకు నివాళులర్పించారు.

యానాది కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలి

కర్లపాలెం, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని యానాదులకు ప్రత్యేకంగా యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ. 1500 కోట్లు కేటాయించాలని ఐఆర్‌ఎస్‌చీఫ్ ఇంజనీర్ మెట్రో హైదరాబాద్ మాణిక్యల ఏడుకొండలు అన్నారు. కర్లపాలెంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యానాదుల శంఖారావం రాష్ట్ర మహాసభను బుధవారం నిర్వహించారు. రాష్ట్రాధ్యక్షుడు బాపట్ల వెంకటపతి అధ్యక్షత వహించారు. ఏడుకొండలు మాట్లాడుతూ యానాదులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఐలెండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహాకూటమినేత బీసీ సరస్వతమ్మ, చీఫ్ అడ్వయిజర్ ఈగా శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి ఏకసిరి నరసింహారావు, కోశాధికారి బెల్లంచర్ల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, ఉమా కొండలుపాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి రూ.50వేల విరాళం

బాపట్ల, ఫిబ్రవరి 14 : టైలర్స్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణం కోసం రూ.50వేల విరాళాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కాటి విజయ్‌కుమార్ బుధవారం ప్రకటించారు. టైలర్స్ అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు పట్టణంలోని ప్యాడిసన్‌పేట వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశాలు

వేమూరు, ఫిబ్రవరి 14 : తెలుగుదేశం పార్టీ వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు ఆయా మండల పార్టీ కార్యాలయాల్లో గురువారం జరుగుతాయని టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఉదయం 10గంటలకు వేమూరులోని పార్టీ కార్యాలయంలో, మధ్యాహ్నం మూడు గంటలకు అమృతలూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో, సాయంత్రం నాలుగు గంటలకు చుండూరులోని బాబా కల్యాణ మండపంలో సమావేశాలు నిర్వహిస్తారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు సమావేశాలకు హాజరవుతారు. ఆయా మండలాల పరిధి గ్రామాల్లో ఉన్న వివిధ విభాగాలపార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని సమావేశాలను జయప్రదం చేయాలని నాయకులు కోరుతున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.50వేలు అందజేత

చెరుకుపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని మెట్టగౌడపాలెంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గంగాంబిక సమేత ఆనందేశ్వరస్వామి, అంబి కాదేవి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. విగ్రహాల ప్రతిష్ఠకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రూ.50వేల ను ఆలయ ధర్మకర్త దాసరి వసుంధరకు అందించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా 1000మందికి అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండ లు, కేసన రామకృష్ణ, పేరం శంకర్, నాగుల నరేంద్ర, తుళ్ళూరి శరత్‌బాబు, కాటూరి నరసింహారావు, కె.శివనాంచారయ్య, శంకరరావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో బీజేపీ నాయకులకు బెదిరింపు

● ప్రాణహాని ఉందంటూ డీజీపీకి ఫిర్యాదు

రేపల్లె, ఫిబ్రవరి 14: తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన బీజేపీ నాయకులపైన అక్రమ తప్పుడు కేసులను బనాయించి అనేక రకాలుగా మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని బీజేపీ సీనియర్ నాయకులు పిన్ని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు వేధింపులపై వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రేపల్లె ప్రాంతంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులు నియోజకవర్గంలో జరుగుతున్న భూకబ్జాలు, అక్ర మ ఇసుక రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లు, నాటుసారా తయారీ, గంజాయి, పోలీస్‌స్టేషన్‌లోనే సెటిల్‌మెంట్ చేస్తున్నారన్నారు. అధికార పార్టీ వల్ల తమకు ప్రాణహాని ఉందని తక్షణమే రక్షణ కల్పించి న్యాయం చేయాలని అందించిన వినతిపత్రంలో కోరారు.

అగ్రిగోల్డు బాధితులకు న్యాయం చేయని వైసీపీ ప్రభుత్వం

రేపల్లె, ఫిబ్రవరి 14: వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరునెలల్లో అగ్రిగోల్డు బాధితులందరికి పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లిస్తామని సీఎం జగన్ హామీనిచ్చి మోసం చేశారని అగ్రిగోల్డు రేపల్లె ఏరియా కన్వీనర్ గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన న్యాయపోరాట దీక్షలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకు లు కేవీ సుబ్బారావు, షేక్ మొహిద్దీన్, లక్ష్మీపద్మ, శ్రీనివాస గుప్తా, గోపాల కృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని గుడి పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మోపిదేవి, మాజీ ఎమ్మెల్యే దేవినేని

రేపల్లె, ఫిబ్రవరి 14: పట్టణంలోని 6వవార్డులో 200 సంవత్సరాల క్రితం నిర్మించిన అతి పురాతనమైన వినాయకుని గుడి పునర్నిర్మాణానికి బుధవారం ఉదయం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావులు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్ళలో పట్టణంలోని పలు ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని అభివృద్ధి చేశామన్నారు. పాత పట్టణం రహదారి అభివృద్ధి, రాణిగారి సత్రం, అంబేద్కర్ భవనం, కన్యకాపరమేశ్వరి దేవాలయ ముఖమండపం, రైతు బజార్‌లను నిర్మాణం చేసి పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కౌన్సిలర్స్ రెడ్డి శంకర్, ఆకిశెట్టి నాగరాజు, వైస్ చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చుక్కలు చూపించిన జగన్

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు ఫిబ్రవరి 14: రైతు సంక్షేమం పేరుతో ఆర్భాటం చేసిన జగన్ చివరికి వారికి చుక్కలు చూపించాడని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం మోదుకూరులో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, సకాలంలో పంట రుణాలు అంటూ హడావిడి చేసిన జగన్ చివరికి వారికి అందించవలసిన తుఫాన్ నష్టపరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీ, రైతుభరోసాకి సంబంధించిన కోట్లాది చెల్లింపులు చెల్లించకుండా చేతులెత్తేశారన్నారు. చివరికి కేంద్రం మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం కింద అందించిన రూ.500కోట్లు కూడా మాయం చేశాడన్నారు. ఇప్పటికి కూడా రైతులకు ఆ నష్టపరిహారం అందించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం కాలంలో వేసిన రోడ్లు, డొంకలు తప్ప ఇప్పటివరకు వైసీపీ ప్రభుత్వం వీటిపై పైసా ఖర్చు చేయలేదని ఆయన తెలిపారు. జగన్ నయవంచన వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు, జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు ఆర్థిక ఒడిదుడుకులకు గురవుతున్నారు. గ్రామాల్లో ఏ రైతును పలకరించినా జగన్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తమవుతుందన్నారు. రానున్న టీడీపీపాలనలో రైతు సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం ఉంటుందని ఆనందబాబు హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు సమష్టిగా విజయం కోసం కృషి చేయాల ని దీనికి అన్ని విధాల సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, కొల్లి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

విద్యావిధానాన్ని నాశనం చేసిన వ్యక్తి జగన్

● మాజీ మంత్రి ఆలపాటి విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

కొల్లూరు, ఫిబ్రవరి 14: విద్యా విధానాన్ని పూర్తిగా నాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. బుధవారం కొల్లూరు టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని చేశారని ఆరోపించారు. చంద్రబాబునా యుడు హయాంలో 5 కి.మీ దూరం లోపు ప్రాథమికోన్నత పాఠశాల, 5కి.మీ దాటితే ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలు, విద్యార్థులకు వసతి గృహాలు, అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేసి ఖాళీ అయిన భవనాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఈ చర్యలపై కోర్టు తీర్పు ఇచ్చేంత వరకు తెలుసుకోలేని అసమర్థ ముఖ్యమంత్రి నువ్వు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, మాజీ జడ్పీటీసీ కోసూరి అప్పయ్య, పార్టీ నాయకులు ధూళిపూడి కృష్ణ, శిగిలిశెట్టి రాఘవరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ఆనందబాబు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా


సమావేశంలో మాట్లాడుతు న్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

భట్టిప్రోలు, ఫిబ్రవరి 14: వేమూరు నియోజకవర్గ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఆనందబాబు నిలుస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి నక్కా ఆనందబాబుపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్న వైసీపీ సమన్వయకర్త అశోక్‌బాబు ఒక చెల్లని నోటుగా ఆయన అభివర్ణించారు. వేమూరు నియోజకవర్గం కోసం చేసిన ప్రత్యేకమైన అభివృద్ధి కానీ అమలు చేసిన సంక్షేమ పథకాలు కాని ఏమైనా ఉంటే అభివృద్ధి సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని అశోక్‌బాబుకు సాయిబాబా సవాల్ విసిరారు. మా నాయకుడు ఆనందబాబుపై అవాకులు చవాకులు పేలితే ఊరుకునేది లేదని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, ఆదిన బసవున్నయ్య, కంభం సుధీర్, నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు మేలు


4వవార్డులో భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని టీడీపీ రేపల్లె పట్టణ ఇన్‌చార్జ్ తాతా ఏడుకొండలు అన్నారు. బుధవారం బాబు ష్యూ రిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో టీడీపీ, జనసేన సంయుక్తంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో పథకాలు రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవ్వడానికి ఉపయోగపడతాయని అన్నారు. రహదారి వెడల్పులో భాగంగా గృహాలు కోల్పోయిన బాధితులకు ఇప్పటికీ ఒక్కరూపాయి అయినా పరిహారం అందించిన దాఖలాలు లేవన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టణాధ్యక్షులు గోగినేని పట్టాభి రామారావు, టీడీపీ నాయకులు నేత్ర నాగేంద్రబాబు, దామెర్ల రమేష్, దేవగిరి రవిశంకర్, దేవగిరి రంగ, డొక్కు, బుజ్జి, కేసన రామకృష్ణ, ల్యాబ్ కిషోర్, పంతాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను తరిమికొట్టేందుకు కలిసి పని చేయాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 14: రాక్షస పాలనను సాగనంపే వరకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని చెరుకుపల్లి, కూరేటిపాలెం గ్రామాల్లో జరుగుతున్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఉద్యోగ, ఉపాధి కల్పన దొరుకుతుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొహమాటం రాధాకృష్ణమూర్తి, వుయ్యూరు శివ, నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, వేము మోహన్‌బాబు, గాదె సాంబశివరావు, సోమయ్య, పూల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి పూజలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 14 : పవిత్ర వసంత పంచమి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని సూరేపల్లి వీపీఅండ్‌జీఎస్‌ఎం హైస్కూల్లో గల శ్రీమాత జ్ఞాన సరస్వతి అమ్మవారికి విద్యార్థులతో అష్టోత్తర పూజ, ప్రత్యేక పూజలు జరిపించారు. ఆధ్యాత్మిక సేవకులు, బాలవికాస్ గురువులు వేమవరం గ్రామానికి చెందిన దారా గిరిజ, దారా నారాయణమూర్తిల ఆధ్వర్యంలో హైస్కూల్లోని 117 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు.

పంచమి రోజున సరస్వతి అమ్మవారిని పూజించడం ద్వారా విద్యార్థులు అమ్మవారి ఆశీస్సులు పొంది విద్యలో రాణించగలుగుతారని బాల వికాస్ గురువులు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తదితరు లు పాల్గొన్నారు.

గాడితప్పిన పర్యవేక్షణ



- బజారుకెక్కిన అద్దంకి పోలీస్ స్టేషన్ పరువు
- 15 నెలలకే ఐదుగురు సీఐలు
- కొందరు రాజకీయ ఒత్తిడిలు.. మరికొందరు వివాదాలతో బదిలీలు
- ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్ళు ఓవర్ యాక్షన్
- మేదరమెట్లకు మారిన రూరల్ సర్కిల్ కార్యాలయం

అద్దంకి, ఫిబ్రవరి 14: అద్దంకి పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయి 15 నెలలకే ఐదుగురు సీఐలు బదిలీ బాట పట్టారు. వీరిలో కొందరిది స్వయం కృపార్థం అయితే మరికొందరు రాజకీయ కోణాలతో బదిలీ అయ్యారు. తక్కువ కాలానికే ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారి బదిలీ కావటంతో కొత్త అధికారి వచ్చి తెలుసుకునేలోపే మరలా బదిలీబాట పడుతున్నారు. దీంతో అద్దంకి పట్టణ పోలీస్ స్టేషన్ పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పినట్లు అయ్యింది.

అద్దంకి పోలీస్ స్టేషన్‌ను 2022 అక్టోబర్ నెలలో అప్‌గ్రేడ్ చేసి సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. గతంలో ఉన్న అద్దంకి సర్కిల్ కార్యాలయాన్ని అద్దంకి రూరల్ సర్కిల్‌గా మార్పుచేసి మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు పోలీస్ స్టేషన్‌లను కేటాయించారు. అదే సమయంలో గతంలో అద్దంకి సర్కిల్‌లో ఉన్న సంతమాగులూరు, బల్లికురవ పోలీస్ స్టేషన్లను సంతమాగులూరు సర్కిల్‌ను ఏర్పాటుచేసి సంతమాగులూరులో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుచేశారు.

అద్దంకి పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయినప్పటినుంచి ఏదోకవిధంగా వివాదస్పదంగా మారుతూనే ఉంది. అప్‌గ్రేడ్ అయిన వెంటనే రాజమోహన్‌రావు టౌన్ సీఐగా, అద్దంకి రూరల్ సీఐగా రోశయ్య వచ్చారు. వీరిద్దరు చీరాలలో పనిచేస్తూ అద్దంకి వచ్చారు. అక్కడ నెలకొన్న విభేదాలే అద్దంకిలోనూ కొనసాగాయి. దీంతో కొద్దిరోజులకే ఆధిపత్య పోరుతో రచ్చకెక్కి రూరల్ సర్కిల్‌ను అద్దంకి నుంచి మేదరమెట్లకు మార్చారు. ఇంతటితో ఆగకుండా రాజమోహన్ స్థానంలో రూరల్ సీఐగా ఉన్న రోశయ్య వచ్చారు. అప్పట్లో రాజకీయ ఒత్తిడితోనే రోశయ్య అద్దంకి టౌన్ సీఐగా వచ్చారన్న ప్రచారం జరిగింది. అప్పట్లో పనిచేసిన సీఐ రోశయ్య, ఎస్సై సమందర్ వలి మధ్య పెద్ద అగాధం వచ్చింది. ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. ఇద్దరిపై అవినీతి ఆరోపణలు లెక్కలేనన్ని వచ్చాయి. వీటి విషయం పక్కన పెడితే ఒకరి వ్యక్తిగత విషయాలలో మరొకరు తొంగి చూడటం జరిగింది. దీంతో ఇద్దరు అధికారులు ఒకరిపై మరొకరు నేరుగా ఫిర్యాదులు కూడా చేసుకున్నట్లు సమాచారం. తీవ్ర ఆరోపణలతో ఇద్దరు అధికారులపై వేటు పడింది. దీంతో కొద్దికాలం ఇన్‌చార్జ్‌గా అద్దంకి రూరల్ సీఐ గా ఉన్న ఉమేష్ వ్యవహరించారు. అనంతరం రమేష్‌బాబు సీఐగా వచ్చారు. తదనంతరం అధికారపార్టీలో మారిన పరిణామాల నేపథ్యంలో రమేష్‌బాబు కూడా కొద్దికాలానికే బదిలీ బాట పట్టారన్న ప్రచారం ఉంది. ఆ స్థానంలో ప్రస్తుతం కృష్ణయ్య వచ్చారు. ఇదిలా ఉంటే కొన్ని సందర్భాలలో ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐలకు తెలియకుండానే ఎస్సైలు, కానిస్టేబుళ్ళు నేరుగా కేసులు, వివాదాలలో తలదూరుస్తూ అత్యుత్సాహం చూపించటం వారిపై వేటుకు కారణాలుగా మారాయి. ఈ కోవలేనే ఎస్సై సమందర్ వలి వీఆర్‌కు వెళ్లారు.

ఇటీవల పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకొని కొద్దిమేర మాత్రమే పట్టుబడ్డట్లు కేసు నమోదు, అధికార పార్టీకి వత్తాసుగా ఉండటంతో పాటు ఓ యువకుడిని ఫోన్‌లో బెదిరింపు ధోరణితో మాట్లాడటం, ఈవిషయాలు ఉన్నతాధికారుల దృష్టికి పోవటంతో ఎస్సై వెంకటేశ్వర్లు కూడా వీఆర్ బాటపట్టారు. ఇక పలు సందర్భాలలో నలుగురు కానిస్టేబుళ్ళను కూడా వివిధ కారణాలతో వేటు పడింది. తాజా గా శంఖవరప్పాడులో మద్యం అక్రమ నిల్వల పేరుతో ఓ ఇంటికి అర్ధరాత్రి సమయంలో వెళ్లిన ఓ కానిస్టేబుల్‌పై కూడా వేటు వేస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తుంది. ఇలా తరచూ అద్దంకి పోలీస్ స్టేషన్ పరువు బజారుకెక్కుతుండటం చర్చనీయాంశంగా మారింది. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు మరింత దృష్టిసారించి అద్దంకి టౌన్ పోలీస్ స్టేషన్‌ను గాడిలో పెట్టేవిధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మొదలెట్టారు..!

- 17న బాపట్ల జిల్లా ఇంకొల్లులో రా..కదలిరా బహిరంగ సభ
- పోలీసులను అడ్డం పెట్టుకుని కుట్రకు తెరలేపిన పాలకులు
- టీడీపీ నేతలను స్టేషన్‌కు రావాలంటూ ఆదేశాలు
- అనుమతుల్లేవంటూ హడావుడి


ఏర్పాట్లకు అనుమతుల్లేవంటూ సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు

బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులో ఈనెల 17న జరిగే రా..కదలిరా... కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎప్పటిలాగానే తనకు అలవాటైన రీతిలో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టింది. రైతుల అంగీకారంతోనే ఇచ్చిన దాదాపు 25 ఎకరాల స్థలం లో సభ ఏర్పాట్లను చేస్తున్నారు. సభకు ఇచ్చిన స్థలంలో కొంత భాగం దేవదాయ శాఖకు చెందినదని ఆ విభాగం అనుమతులు తీసుకోలేదని వారు ఫిర్యాదు చేశార ని బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చిన పోలీసులు హడావిడి చేశారు. సదరు విభాగం ఇచ్చిన ఫిర్యాదు కాపీని చూపమని అడిగినప్పటికీ పోలీసుల నుంచి స్పందన కరువైందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

విజయవంతం అవుతుందనే అక్కసుతోనే..

చంద్రబాబు పర్యటన రెండు రోజుల క్రితమే ఖరారయింది. సభ కోసం కావాల్సిన స్థలం ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా సహకరించడంతో ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. బుధవారం ఆ ప్రాంగణంలో భూమిపూజ జరగడంతో పాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాయకులతో అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సన్నాహక సమావేశం కూడా నిర్వహించారు. సభ విజయవంతం కానుందనే సమాచారం నేపథ్యంలో తాడేపల్లి పెద్దల ఆదేశాలతో అనుమతుల పేరిట కొత్త కుట్రకు తెరలేపారని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

పనులు ఆపాల్సిందే..

సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు ఏర్పాట్లను ఆపాల్సిందేననే హుకుం జారీ చేయడంతో పాటు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలను ఇంకొల్లు స్టేషన్‌కు రావాలని కూడా తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఎందుకు ఏర్పాట్లు ఆపాలో రాతపూర్వకంగా ఇవ్వాలని, దానికి దేవదాయ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు కాపీని కూడా జతచేయమని టీడీపీ నేతలు అడిగారు. దానికి సమాధానంగా స్టేషన్‌కు వచ్చి డీఎస్పీ, సీఐతో మాట్లాడుకోమనే సమాధానం వచ్చింది తప్పితే ఆధారాలు చూపలేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు టీడీపీ నేతలు వెళ్లేసరికి అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోగా ఫోన్‌లో కూడా స్పందించకపోవడం గమనార్హం.

ప్రజాక్షేత్రంలో ఎండగడతారనే...

పర్చూరు నియోజకవర్గంలో జరిగిన ఓట్ల అక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. వీటిపై పోరాడిన ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగా ఇటీవల ప్రభుత్వం అక్రమ కేసులకు తెరలేపింది. గ్రానైట్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా పాలకులు కక్షసాధింపులకు దిగడం, ప్రైవేటు సైన్యంతో అధికారులు ఫ్యాక్టరీలలో సోదాలు నిర్వహించడం వంటివన్నీ జనాల్లో చర్చకు దారితీశాయి. వీటన్నింటితోపాటుగా పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వసూళ్ల పర్వం నడిపిన తీరు కూడా ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. చంద్రబాబు సభ నేపథ్యంలో ఈ అంశాలన్నింటినీ ప్రజాక్షేత్రంలో ఆయన ఎండగడతారనే భయంతోనే సభకు ఏదో విధంగా అవాంతరాలు సృష్టించే ప్రయత్నం చేస్తుందని టీడీపీ నేతలు మండిపడుతున్నారు

రాత్రి వేళ తమను ఇలా...

చట్టబద్ధంగా అన్ని అనుమతులు తీసుకుని సభ ఏర్పాట్లను ప్రశాంత వాతావరణంలో చేసుకుంటున్న తమను రాత్రి వేళ పోలీసులు వచ్చి కక్ష గట్టినట్లు వ్యవహరించడం పట్ల టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తాము అడిగిన ప్రశ్నలకు పోలీసుల నుంచి సమాధానమే కరువైందని, పైగా తమను రాత్రి వేళ స్టేషన్‌కు రమ్మని హెచ్చరించారని శ్రేణులు వాపోయాయి. అక్కడకు వెళితే కనీసం స్పందించే వారే కరువయ్యారని, ఈ చర్యలన్నీ కేవలం వేధించడానికే చేస్తున్నారని ప్రజలు ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం తథ్యమని నేతలు తెలిపారు.

బాబు సభకు అడ్డంకులా? ఏలూరి

అమరావతి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో నిర్వహించే రా.. కదలిరా సభకు అధికార పార్టీ అడ్డంకులు సృష్టించడంపై బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా మండిపడ్డారు. ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాక పోలీసులను అడ్డంపెట్టుకుని, అధికార పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు సభకు జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్ని అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేయడంతో పాటు హెలీపాడ్‌కు ఆర్‌అండ్‌బీకీ దరఖాస్తు చేసినట్లు ఆయన బుధవారం మీడియాకు చెప్పారు.

ఇంకొల్లులోని పావులూరు రోడ్డులో ఓ రైతు లీజుకు తీసుకున్న దేవదాయశాఖ భూమిలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్న సమయంలో ఆశాఖ అధికారులు ఫిర్యాదు చేశారంటూ పనులు నిలిపివేయాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారన్నారు. రైతు లిఖితపూర్వక అంగీకారంతోనే పనులు పూర్తి చేయగా, సభను భగ్నం చేయడానికి ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. పోలీసులతో వైసీపీ ప్రభుత్వం తన మార్కు రాజకీయానికి తెరదీసిందని విమర్శించారు.

ఆసరా చెక్కుల పంపిణీ

మార్టూరు, ఫిబ్రవరి 14: స్థానిక కోణిదెన రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 1325 డ్వాక్రా గ్రూపులకు రూ.9 కోట్ల 74 లక్షలు మంజూరయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ డ్వాక్రా గ్రూపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు మండలంలోని బొల్లాపల్లిలో గ్రామ సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్ నూతన భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా శాంతిబాయి, సర్పంచ్ భుక్యా సుమితాబాయి, ఏపీఎం రాజారత్నం, పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తానవలి, బాబూ నాయక్, కాకోలు రామారావు, గర్నెపూడి రవిచందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

- ప్రతిపక్ష పార్టీలపై కక్షసాధింపు చర్యలు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 14: ప్రజాసంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఈనెల 17న ఇంకొల్లులో జరగనున్న చంద్రబాబు సభకు సంబంధించి బుధవారం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సాంబశివరావు మాట్లాడుతూ ఇంకొల్లులో ఈనెల 17 న జరగనున్న రా కదలిరా సభ బాపట్ల జిల్లాలోనే చారిత్రాత్మకమైన రోజుగా, భవిష్యత్ తరాలకు నూతన అధ్యాయంగా మిగలనున్నదని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొనే ఈ సభతో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పతనానికి నాంది ప్రారంభమవుతుందన్నారు. రా కదలిరా సభకు లక్షన్నర మందితో భారీగా సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సభ ద్వారా చంద్రబాబు వైసీపీ అరాచకాలపై శంఖారావం పూరిస్తున్నారన్నారు. వైసీపీ అరాచకాలను దౌర్జన్యాలను ఎదిరిస్తూ బాపట్ల జిల్లాలో తెలుగుదేశం పార్టీ మహాశక్తిగా ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదలిరా పేరుతో చంద్రబాబు రాష్ట్రంలో సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇంకొల్లులో జరిగే సభతో వైసీపీ ప్రభుత్వం పతనం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వ విధానాన్ని ఎండ గట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపు నిచ్చారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, మాజీమంత్రి కొల్లు రవీంద్రబాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో టీడీపీ ఘన విజయం సాధించడం ఖాయమని అన్నారు. జిల్లాలో టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ దౌర్జన్యాలకు బెదరకుండా, అక్రమ కేసులకు భయపడకుండా దీటుగా ఎదుర్కొని జిల్లాను ఎమ్మెల్యే ఏలూరి అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. గత నాలుగేళ్లుగా అధికార పార్టీకి తలవంచక పార్టీని దీటుగా నడిపించిన ఏలూరి సేవలను ప్రజలు మరచిపోరన్నారు. వచ్చే తెలుగుదేశం ప్రభుత్వంలో ఏలూరికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించేవారందరూ చంద్రబాబు వెంట నడవాలని వారు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్ర వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, చీరాలకు చెందిన నాయకుడు ఎం.అమర్నాథ్, టీడీపీ రాష్ట్ర నాయకులు చిట్టి, వేములకొండ శ్రీనివాస్, దయాబాబు, జి.కోటేశ్వరరావు, తాత జయప్రకాష్, పిల్లి మాణిక్యాలరావు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు

- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక
- సీనరేజ్ నిధులు ఒక పంచాయతీకే కేటాయించారని మూడు గ్రామాల సర్పంచ్‌ల ఫిర్యాదు


సీనరేజ్ నిధులు కేటాయించాలని అర్జీ ఇస్తున్న మల్లాయపాలెం సర్పంచ్ రాఘవరావు

బల్లికురవ, ఫిబ్రవరి 14: అధికారులు బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరించారు. బుధవారం బల్లికురవలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు తరలివచ్చారు ఎక్కువగా భూసమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. మల్లాయపాలెె, నక్కబొక్కలపాడు, కె.రాజుపాలెం గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు దూళిపాళ్ల బుల్లిరామయ్య, ఔపల్లి రాఘవరావు, అమరనేని లక్ష్మీ తమ గ్రామాలకు రావల్సిన మైనింగ్ సీనరేజ్ గ్రాంటు ఒక్క కొణిదెన గ్రామానికే కేటాయించారని పేర్కొన్నారు. ఎన్నేళ్ల నుంచి వాటాల మేరకు వస్తున్న సీనరేజ్‌ను అధికారులు పక్కదారి పట్టించారని ఫిర్యాదుచేశారు. మైనింగ్, పంచాయతీ అధికారులకు దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే, కొనిదెన గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కుంచపు అంజనేయులు తాను ప్రభుత్వ భవనాలు, పైపులైన్లు పనులు చేశానని, ఇంతవరకు బిల్లులు రాలేదని ఫిర్యాదు చేశారు. బల్లికురవ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాము పాఠశాలకు రావాలంటే పొరుగు గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు లేవని, వెంటనే కేటాయించాలని కోరారు. అంబడిపూడి ఎస్సీ కాలనీవాసులు తమకు మురికి కాలువలు లేవని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని అర్జీ ఇచ్చారు. కొప్పెరపాడుకు చెందిన పేరెంట్స్ కమిటీ తమ పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం కేటాంచాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలపై అయా శాఖల అధికారుల ద్వారా విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఎంతో కాలం నుంచి ఉన్న పెండింగ్ సమస్యలు కూడా సకాలంలో పరిష్కారం చూపేలా జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన హనిమిరెడ్డి, డీఆర్వో వెంకటరమణ, చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సుభద్ర, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, జిల్లాలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నామ్ రోడ్డు మార్జిన్‌లే పార్కింగ్ స్థలాలు

- తరచూ ప్రమాదాలు
- ఆగిఉన్న వాహనాలను ఢీకొడుతున్న వైనం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు


అద్దంకి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

అద్దంకి, ఫిబ్రవరి 14: నామ్ రోడ్డు మార్జిన్‌లోనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనచోదకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నార్కెట్‌పల్లి- అద్దంకి- మేదరమెట్ల (నామ్)రోడ్డులో రెస్ట్ ఏరియాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేదు. దీనికితోడు అత్యధిక శాతం లారీలు, కంటైనర్‌లు ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడులను కలుపుతూ వస్తువుల రవాణాకు నామ్ రోడ్డు దగ్గర మార్గంగా ఉంది. దీంతో అత్యధిక శాతం లారీలు, కంటైనర్‌ల డ్రైవర్‌లు పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన డ్రైవర్‌లు కావటంతో నామ్ రోడ్డు వెంబడి పెద్ద సంఖ్యలో డాబాలు, రెస్టారెంట్‌లు వెలిశాయి. దీంతో వాహనాలను రోడ్డు మార్జిన్‌లలో నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు. రోడ్డు మార్జిన్‌లోనే వాహనాలు నిలుపుతూ సిగ్నల్స్ కూడా వేయక పోతుండటంతో వెనుకనుంచి వచ్చే వాహనాల చోదకులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల శింగరకొండ-అద్దంకి మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు వదిలాడు. మరికొన్ని సందర్భాలలో వాహనచోదకులు క్షతగాత్రులవుతున్నారు. నామ్ రోడ్డుపై రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి మార్జిన్‌లో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీఎంవోలో ఫలించని ఆమంచి ప్రతిపాదన

- రెండు రోజుల్లో సీఎంతో అపాయింట్‌మెంట్

చీరాల, ఫిబ్రవరి 14: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం సీఎంవో నుంచి పిలుపు రావటంతో వెళ్లారు. సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి ముందు ఆమంచి తెలిపిన అభ్యర్థన ఫలించలేదని తెలిసింది. ఈ క్రమంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌తో అపాయింట్‌మెంట్ ఖరారయిందని, అప్పుడు అమీతుమీ తేల్చుకుంటారని చీరాల నియోజకవర్గంలోని ఆమంచి అనుచరులు చెప్పుకుంటున్నారు. బుధవారం పర్చూరు నియోజకవర్గం మార్టూరులో ఆసరా కార్యక్రమంలో ఆమంచి పాల్గొన్నారు. ఆసమయంలో సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు ఆమంచి హడావుడిగా బయలుదేరి వెళ్లారు. అయితే, కొద్ది రోజులుగా ఆమంచి తాను చీరాల నుంచే పోటీ చేస్తానని చీరాల నియోజకవర్గంలోని తన అనుచరులకు చెప్పిన నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం వెనువెంటనే ఒకటికి నాలుగు పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. ఆ తరువాత తాజాగా చీరాలకు చెందిన ఎస్‌ఆర్‌ఐ యడం బాలాజీ పేరు తెరపైకి వచ్చింది. బాలాజీ పేరు అంతిమంగా ఖరారవుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆమంచికి సీఎంవో నుంచి వర్తమానం అందటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంవోలో ధనుంజయరెడ్డికి ఆమంచి తన వాదన , అభ్యర్థన వినిపించినట్లు తెలిసింది. గతంలో తనకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత కార్యాచరణ ఉండాలనేది ఆ వాదన, అభ్యర్థన సారాంశమని సమాచారం. అయితే అందుకు సానుకూలత లభించలేదని తెలిసింది.

ఈనేపథ్యంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఖరారయిందని, ఆరోజు అమీతుమీ తేల్చుకునే దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు ఆమంచి అనుచరులు చెప్తున్నారు. అంతిమంగా గతంలో అధిష్ఠానం తనకు ఇచ్చిన హామీ, తన ప్రతిపాదన, అభ్యర్థనలను పరిగణలోకి తీసుకోవాలని, లేదంటే పార్టీ ఏదన్నా కానీ చీరాల నుంచే ఆమంచి పోటీ చేస్తారని అతని అనుచరులు ఘంటాపథంగా చెప్తుండటం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అందులో భాగంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడికలు, తీసివేతలు వేస్తూ లాభనష్టాలను బేరీజు వేసుకుంటున్నారు.

ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 14 ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జేఏసీ పర్చూరు తాలూకా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దుచేస్తామని చెప్పి నేటికి అమలుకు నోచుకోకపోవటం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపటమేనన్నారు. పీఆర్‌సీని అమలు చేయటంతోపాటు, ఐఆర్‌ను కూడా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

అద్దంకి, ఫిబ్రవరి 14: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ పిలుపు మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి వినతిప త్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అద్దంకి తాలూకా చైర్మన్ గద్దల కిరణ్‌కుమార్, వైస్‌చైర్మన్ తాళ్ళూరి రమేష్‌బాబు, ఎన్జీవో నాయకులు ఏడుకొండలు, రవికుమార్, కార్మిక సంఘాల నాయకులు గడ్డం శ్రీనివాసరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

చీరాల, ఫిబ్రవరి 14: తెలుగుదేశం పార్టీ చీరాల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అధ్యక్షతన జరుగుతుందని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 17న ఇంకొల్లులో పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొనే రా.. కదలి రా సభను జయప్రదం చేసేందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ప్రశాంతమైన ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 14: ప్రశాంతమైన ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని తోటవారిపాలెం, పిట్టువారిపాలెం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కార్యాలయం సిబ్బందితో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కార్యాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చీకటి చట్టాన్ని రద్దుచేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 14: అనాలోచితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కుల చట్టం 2022తో రైతులు రక్షణ కోల్పోతారని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా నూతన చట్టాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇది భూ హక్కు చట్టం కాదని, చీకటి చట్టమన్నారు. న్యాయ, అన్యాయాలు రెవెన్యూ అధికారుల చేతుల్లోకి వెళితే అమాయకులు ఆసరా కోల్పోతారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు రామకృష్ణ, సురేష్, ప్రసాద్, రాము పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14: శ్రీప్రకాశం ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతిదేవి జన్మనక్షతం వసంత పంచమి సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఈనెల 18న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులందరూ పాల్గొని జయపద్రం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కౌన్సిలర్ దామ నాగేశ్వరరావు కోరారు. బుధవారం అద్దంకిలోని శ్రీప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శుద్దపల్లి స్వామి, వెంకయ్య, ఉదయ్‌కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ముప్పవరంలో టీడీపీ సన్నాహక సమావేశం

పంగులూరు, ఫిబ్రవరి 14: మండలంలోని ముప్పవరం గ్రామంలో గురువారం తెలుగుదేశం పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశం జరుగుతుందని పార్టీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈనెల 17న ఇంకొల్లులో జరిగే రా కదలిరా సమావేశానికి సంబంధించి పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశం ఉదయం 10 గంటలకు ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.సమావేశానికి మండలంలోని క్లష్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధాల విభాగాల నేతలు హాజరు కావాలని కార్యాలయ ప్రతినిధి కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

చినగంజాం, ఫిబ్రవరి 14: మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పెద్దపల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, శిఖర గరుడ ఆళ్వార్ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదమం 6 గంటల నుంచి పుణ్యాహవచనం, రత్న స్థాపన, యంత్ర స్థాపన, బింబ ప్రతిష్ఠ స్థాపన కళావాహనం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, తదితర కార్యక్రమాల హోమాలు, పూజలను వేద పండితులు దంపతులచే నిర్వహించారు. తదనంతరం బ్రహ్మశ్రీ సహస్ర ప్రతిష్ఠ ఆచార్య పరుచూరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శంచుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శేరు వంశస్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 14: ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ, ఏపీఎన్‌జీవో ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెంట్యాల చంద్రశేఖర్, గోపీ, యూటీఎఫ్ , ఏపీటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

మార్టూరు, ఫిబ్రవరి 14: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణ అన్నారు. బుధవారం మార్టూరులోని జడ్పీ హైస్కూల్, హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో వసతులను పరిశీలించారు. విద్యార్థుకు పెట్టిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. రిజిస్టర్లను సక్రమంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రాంనాయక్ పా ల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

మార్టూరు, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా బుధవారం మార్టూరులోని శ్రీహర్షిని ఒలంపియాడ్ స్కూల్లో 42 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ సతీమణి కవిత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె చేతులమీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: ప్రముఖ వైద్యులు, రోటరీక్లబ్ చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ కొడాలి ధర్మానందరావు గంగవరంలోని మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, సరుకులు, పండ్లు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో బుధవారం తన కుమారుడు కొడాలి ప్రభాకర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు దుప్పట్లు, కందిపప్పు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావు, మద్దినేని హనుమంతరావు, రాఘవరాజు, సోమేపల్లి రామ్మోహనరావు, గోరంట్ల నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు బొడ్డు వరప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా డా.బీరం సుందరరావు తమ తల్లిదండ్రుల పేరున రూ.5వేలు విరాళం ఆశ్రమ నిర్వహకులు వరప్రసాద్‌కు అందజేశారు.